
విష జ్వరాల పంజా





● సత్తెనపల్లి ఏరియా వైద్యశాలలో చికిత్స పొందుతున్న జ్వర పీడితులు

డెంగీ జ్వరం దడపుట్టిస్తోంది.. టైఫాయిడ్ విజృంభిస్తోంది.. మలేరియా నేనెక్కడకీ పోలేదంటున్నది. మొత్తం మీద వైరల్ జ్వరాలతో పల్లె పట్టణం అన్న తేడా లేకుండా వణికిపోతోంది. వాతావరణంలో చోటు చేసుకుంటోన్న మార్పులు.. అపరిశుభ్రత.. అడుగంటిన పారిశుధ్యం.. దోమలు.. తదితరాల కారణంగా విష జ్వరాలు ప్రభలుతున్నాయి. ఉమ్మడి గుంటూరు జిల్లాల్లో ఇటీవల పలు ప్రాంతాల్లో మరణాలు కూడా సంభవించాయంటే జ్వరాలు ఏ స్థాయిలో ఉన్నాయో తెలుసుకోవచ్చు. పల్లెలు మంచం పట్టగా ఆస్పత్రులు జ్వర పీడితులతో కిటకిటలాడుతున్నాయి. గుంటూరు ప్రభుత్వ వైద్యశాల నుంచి గ్రామాల్లోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల వరకు జ్వర పీడితులు బారులు తీరుతున్నారు. ఇక ప్రైవేటు వైద్యశాలల్లో అయితే ఐసీయూలు కూడా డెంగీ లక్షణాలతో ఉన్న వారితో నిండిపోయినట్లు సమాచారం. అధికారికంగా డెంగీ కేసులను వైద్య ఆరోగ్య శాఖ ప్రకటించకపోయినా పలు పల్లెలు, పట్టణాల్లో పలువురు అల్లాడుతున్నట్లు తెలుస్తోంది. జ్వరాల తో ప్రజలు వణికిపోతున్నా అధికారులు తూతూ మంత్రపు చర్యలతో నిర్లక్ష్యాన్ని వీడటంలేదన్న విమర్శలు వస్తున్నాయి.

- డెంగీ దడ.. టైఫాయిడ్ విజృంభణ
- వైరల్ జ్వరాలతో అల్లాడుతున్న ప్రజలు
- రోజురోజుకూ పెరుగుతున్న జ్వరపీడితులు
- మంచం పట్టిన పల్లెలు.. ఆస్పత్రులు కిటకిట
- మరణిస్తున్నా.. తూతూమంత్రంగా శిబిరాలతో సరి
- పడకేసిన పారిశుధ్యం.. పట్టీపట్టనట్లుగా అధికారులు

ఆంధ్రజ్యోతి న్యూస్‌నెట్‌వర్క్, ఆగస్టు 17: జ్వరం.. ఈ పదం ఇప్పుడు అందరినీ భయపెడుతోంది. ప్రధానంగా టైఫాయిడ్, మలేరియా, ఫ్లూ జ్వరాల కేసులు ఎక్కువగా నమోదవుతున్నాయి. ఎక్కడ ఎవరికి ఏ కారణంతో జ్వరం వచ్చినా అది డెంగీ భూతమేమోనని జనం హడలిపోతున్నారు. జలుబు, దగ్గుతో ప్రారంభమయ్యే జ్వరాలు గతంలో 3, 5 రోజుల్లో తగ్గేవి. అయితే ప్రస్తుతం వస్తున్న జ్వరాలు తీవ్ర స్థాయిలో ఉండటం.. ఒకటి రెండు రోజుల్లోనే నీరసంతో యువకులు సైతం అల్లాడిపోతున్నారు. ప్రభుత్వ ఆస్పత్రులపై నమ్మకం లేక తప్పనిసరి పరిస్థితుల్లో ప్రైవేటు ఆస్పత్రులకు వెళ్లడంతో వారు మరింతగా జ్వరపీడితులను, వారి కుటుంబసభ్యులు భయభ్రాంతులకు గురి చేస్తున్నారు. డెంగీ జ్వరమని చెప్పడం.. ప్లేట్‌లెట్ కౌండ్ తగ్గిపోతుందంటూ దోపిడీ చేసేస్తున్నారు. కాలానుగుణంగా వచ్చే మలేరియా.. డెంగీ.. టైఫాయిడ్ కేసులు గుబులు రేపుతున్నాయి. గుంటూరు, పల్నాడు, బాపట్ల జిల్లాల్లో డెంగీ కేసులు నమోదవుతున్నాయి. చిన్న పిల్లల్లో టైఫాయిడ్ కేసులు నమోదవుతున్నాయి. అధికారుల నిర్లక్ష్యంతో జ్వరాల కేసులు రోజురోజుకు పెరిగిపోతున్నాయి. జ్వరం అనుకుని తొలుత ఇంటి దగ్గర్లోని షాపుల్లో మందులు తెచ్చుకుని వినియోగిస్తున్నారు. జ్వరం ఎంతకీ తగ్గకపోతుండటంతో రక్త పరీక్షలు చేయించుకుంటున్నారు. జ్వర పీడితుల్లో చిన్నారులు ఎక్కువగా ఉంటున్నారు. జ్వర పీడితుల్లో పేట్‌లెట్స్ స్థాయి పడిపోయి ప్రాణాంతకంగా పరిణమిస్తోంది.

- నరసరావుపేట ప్రభుత్వ ఆస్పత్రిలో ఇటీవల జరిపిన రక్త పరీక్షల్లో 7 డెంగీ కేసులు నమోదయ్యాయి. ఇక ప్రైవేట్ ఆస్పత్రుల్లో కూడా డెంగీ కేసులు నమోదవుతున్నట్లు వైద్యులు తెలిపారు. నరసరావుపేటలోని ప్రైవేట్ రక్త పరీక్ష కేంద్రాలు రెండింటిలో జ్వరాల కేసుల నమోదును పరిశీలించగా పది మందికి రక్త పరీక్షలు చేయగా రెండు డెంగీ కేసులు నమోదు అవుతున్నాయని నిర్వాహకులు తెలిపారు. వినుకొండ మండలంలోని ఉప్పరపాలెం గ్రామంలో వైరల్ జ్వరాలతో గ్రామీణులు అల్లాడుతున్నారు. ఊపిరాడని దగ్గు, తుమ్ములు, జ్వరంతో పిల్లలు పలువురు అస్వస్థతకు గురయ్యారు. గ్రామంలో ఒకే కుటుంబానికి చెందిన లక్ష్మీతిరుపతమ్మ, గాలం సింహాద్రి, గాలం రాణీలు వైరల్ జ్వరాలతో అల్లాడుతున్నారు. మండిపోతున్న జ్వరాలతో, వైద్యసిబ్బంది వచ్చేదాక ఆగలేక పలువురు ప్రైవేటు ఆస్పత్రులను ఆశ్రయించారు. గ్రామంలో పారిశుధ్యం అధ్వానంగా ఉన్నందునే తాము ఇబ్బందులు పడుతున్నట్లు గ్రామీణులు ఆరోపిస్తున్నారు. రొంపిచర్ల మండలం రొంపిచర్ల రెడ్డిపాలెం పరిధిలోని గ్రామాల్లో మలేరియా జ్వరాలు విజృంభిస్తున్నాయి. స్థానికంగా ఉన్న ఆర్ఎంపీల వద్ద వైద్య చికిత్సలు చేయించుకుంటున్నా పరిస్థితి అదుపులోకి రావడంలేదు. సత్తెనపల్లి నియోజకవర్గ పరిధిలో పల్లె, పట్టణం, చిన్న, పెద్ద అనే వ్యత్యాసం లేకుండా జ్వరాలు చుట్టేస్తున్నాయి. ప్రైవేట్ ఆస్పత్రుల్లో రోజుకు సగటున జ్వరాలతో వచ్చే వారి సంఖ్య 40 వరకు ఉందని వైద్యులు తెలిపారు. సత్తెనపల్లి ఏరియా వైద్యశాలకు సాధారణ జ్వరాలతో వచ్చే వారు రోజుకు 30 నుంచి 50 మంది వరకు ఉంటున్నట్లు సమాచారం. ఈ నెల 1 నుంచి 15వ తేదీ వరకు సత్తెనపల్లి ఏరియా వైద్యశాలలో జ్వర పీడితులు పెద్దవారు 450 మంది, చిన్న పిల్లలు 70 మంది చికిత్స పొందారని ఆస్పత్రి వర్గాలు తెలిపాయి. ఇంకా స్పత్రిలో వివిధ గ్రామాలకు చెందిన జ్వర పీడితులు 20 మంది వరకు ఉన్నారు. ఇద్దరు ముగ్గురు డెంగీతో చికిత్స పొంది వెళ్లారు. ఈ 20 మందిలో టైఫాయిడ్ బాధితులు కూడా ఉన్నారు. అచ్చంపేట మండలం కొండూరు, నిండుజర్ల, తాడువాయి గ్రామాల్లో ప్రజలు జ్వరాలతో అల్లాడుతున్నారు. ఎక్కువ మందికి టైఫాయిడ్ జ్వరాలని సమాచారం. దాచేపల్లి మండలంలోని శ్రీనగర్, పొందుగల, శ్రీనివాసపురం, దాచేపల్లిలోని జలగడబజార్, మస్కిట్‌బజార్, వడియరాజుల కాలనీ, నడికుడిలోని ఎస్సీ కాలనీ, నారాయణపురంలో జ్వరంతో బాధపడే వారి సంఖ్య అధికంగా ఉంది. రక్తకణాలు పడిపోవడంతో పలువురు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. వైద్య ఆరోగ్యశాఖ అధికారులు ఆయా గ్రామాలపై దృష్టి సారించలేదు.



వినుకొండ : ఉప్పరపాలెంలో దగ్గు, జ్వరంతో బాధపడుతున్న చిన్నారులు



దాచేపల్లి: ప్రైవేటు వైద్యశాలలో బెడ్లు లేక కుర్చీలో సెలైన్ ఎక్కించుకుంటున్న రోగులు

ఇప్పటికే దాచేపల్లిలోని ప్రైవేటు వైద్యశాలలన్నీ రోగులతో కిటకిటలాడిపోతున్నాయి. ప్రైవేటు వైద్యశాలలో బెడ్లు లేక కుర్చీలలోనే కూర్చొని సెలైన్‌లు పెట్టించుకోవడం చూస్తుంటే పరిస్థితి ఎంత తీవ్రంగా ఉందో తెలుస్తుంది.

● బాపట్ల మండలం ముత్తాయపాలెం గ్రామంలో విష జ్వరాలతో పలువురు మంచంపట్టారు. గ్రామంలో ఒకరు డెంగీ లక్షణాలతో మృతి చెందినట్లు తెలిసిన అధికారులు హడావుడిగా ప్రత్యేక పారిశుధ్య కార్యక్రమాలు నిర్వహించి వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. ఇంటింటా సర్వే నిర్వహించి జ్వరపీడితులను గుర్తిస్తున్నారు. మూడురోజులపాటు జ్వరం తగ్గని అనేకమందిని ఆస్పత్రులకు తరలించారు. పంచాయతీ పరిధిలోని ప్రతి ప్రాంతంలో ఇప్పటికీ జ్వర పీడితులు అనేక మంది ఉన్నారు. వైద్య శిబిరం కొనసాగిస్తున్నప్పటికి జ్వరాలు అదుపులోకి రాలేదు. బాపట్ల పట్టణంలోని 2వ వార్డు రామకృష్ణాపురంలో ఓ వ్యక్తికి తీవ్రమైన జ్వరంతో గుంటూరులో వారం నుంచి చికిత్స పొందుతున్నారు. చీరాల ఏరియా వైద్యశాలకు ప్రతిరోజూ సరాసరిన 350 ఓపీలు వస్తుండగా అందులో సుమారు 50 నుంచి 60 మంది వరకు జ్వరపీడితులు ఉంటున్నారు. అందులో రమారమి 10 శాతం మంది ఇన్‌పేషెంట్లుగా చేరుతున్నారు. ప్రైవేటు ఆస్పత్రులకు వచ్చే వారిలో సగం మంది జ్వరపీడితులు ఉంటున్నారు.

● చేబ్రోలు మండలంలోని వడ్లమూడి గ్రామం విష జ్వరాలతో మంచం పట్టింది. విష జ్వరాలతో ఇటీవల ఆరుగురు ఆస్పత్రిలో చేరారు. విష జ్వరాలతో బాధపడుతున్న తాతారావు(65), కృష్ణ కుమారి(52) నాలుగు రోజుల క్రితం మృతి చెందినట్లు గ్రామస్తులు తెలిపారు. విష జ్వరాలతో ఇద్దరు మృతితో వైద్య ఆరోగ్య శాఖ అధికారులు అప్పటికప్పుడు గ్రామంలో వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేసి ఇంటింటి సర్వే నిర్వహించారు. వైద్య శిబిరంలోనే 30 మంది జ్వర పీడితులు, జ్వర లక్షణాలతో ఉన్నవారిని గుర్తించారంటే పరిస్థితి అర్థం చేసుకోవచ్చు.

మంచినీరే.. స్థావరం

అందరినీ భయపెడుతున్న డెంగీ కారక వైరస్‌ను మోసుకొచ్చే దోమ ఈడీస్ ఈజిప్ట. ఈ దోమ పగటి పూట మాత్రమే సంచరిస్తుంది. అది కూడా రోజుకు రెండు సార్లు ఆకలి అయినప్పుడు మాత్రమే ఉదయం, సాయంత్రం రక్తం తాగుతుంది. ఇది నివాసం ఏర్పర్చుకున్న పరిసరాన్నుంచి కేవలం 30 అడుగుల దూరం మాత్రమే ప్రయాణిస్తుంది. అది కూడాభూమి కన్నా రెండు అడుగులు మించి లెగవదు. అది కూడా ఆడదోమ మాత్రమే. ఇది మురుగులో ఉండదు. ఇది మంచినీటిపైనే గుడ్లు పెడుతుంది. ఇంట్లో వాడకుండా వదిలేసిన పాత సామాన్లు, టైర్లు, కొబ్బరి బోండాలు, పూల కుండీలు వాటర్ ట్యాంక్‌పై ఉండే చిన్న చిన్న రంధ్రాలు వాటిలో చేరిన వర్షపు నీరును ఇది స్థావరంగా ఏర్పర్చుకుంటుంది. 15 రోజుల పాటు మన ఇంటి పరిసర ప్రాంతాల్లో ఎటువంటి మంచినీరు నిల్వ ఉండకుండా చూసుకుంటే మన కుటుంబం డెంగీ బారిన పడనట్లే. కేవలం మన పరిసరాల పరిశుభ్రతే మనల్ని డెంగీ నుంచి కాపాడుతుంది.

డెంగీ.. కంగారు

డెంగీతో ప్లేట్‌లెట్లు తగ్గిపోయాయంటూ రోగులు, వైద్యులు చేసే హడావిడి అంతా ఇంతా కాదు. ప్రతి జ్వరానికి ప్లేట్‌లేట్ల పరీక్ష పేరిట రోగులను భయపెట్టి అందిన కాడికి దండుకున్నారు. వాతావరణ మార్పుల కారణంగా విస్తరిస్తోన్న వైరల్ జ్వరాల్లో 90 శాతం సాధారణ ఫ్లూ జ్వరాలే. అయితే వైద్యులు వ్యాపార రీత్యా డెంగీతో పాటు ప్లేట్‌లెట్ల సంఖ్య పరీక్షలను సూచిస్తున్నారు. ప్రైవేటు ల్యాబుల్లో చేస్తున్న పరీక్షల్లో నూటికి 90 మందికి డెంగీ ఉన్నట్లుగానే చూపుతుంది. దీనికితోడు అక్కడక్కడ సంభవిస్తున్న మరణాలతో ప్రజలు భయభ్రాంతులకు గురవుతున్నారు.

దోమల ఫాగింగ్ శూన్యం



ఉమ్మడి గుంటూరు జిల్లా పరిధిలో గుంటూరు నగరం నుంచి పల్నాడు, బాపట్ల జిల్లా కేంద్రాలతో పాటు పల్లెలు, పట్టణాల్లో పారిశుధ్యం పూర్తిగా అడుగంటిపోయింది. గతంలో కురిసిన వర్షాలతో అపరిశుభ్రత తాండవిస్తోంది. రాత్రిళ్ల కాదు పగలు కూడా దోమల విజృంభణతో ప్రజలు అల్లాడుతున్నారు. దోమలు, అపరిశుభ్రత కారణంగా ప్రజలు రోగాల బారిన పడుతున్నా అధికారుల్లో చలనం లేదు. మున్సిపాలిటీలు, పంచాయతీల్లో దోమల నివారణ చర్యలను గాలికొదిలేశారు. దోమల నివారణకు ఫాగింగ్ చేయడమే మున్సిపాల్టీలు మరిచిపోయాయి. వారానికోసారి కూడా ఫాగింగ్ జరగడంలేదు. మురుగు కాల్వల్లో దోమల నివారణ మందుల పిచికారి చేయడాన్నే మానేశాయి. పల్లెలు, పట్టణాల్లోని కాలనీలు జ్వరాలతో మంచం పట్టినట్లు మీడియాలో కథనాలు వచ్చిన సందర్భాల్లో వైద్య ఆరోగ్యశాఖ హడావుడిగా వైద్యశిబిరాలను నిర్వహిస్తోంది.



గుంటూరులో ర్యాలీ నిర్వహిస్తున్న వైద్య బృందం



ప్రాణదాతలకు రక్షణేది?

- కోల్‌కతా ఆర్జీకర్ వైద్యశాల ఘటనపై నిరసన
- ప్రభుత్వ, ప్రైవేటు ఆస్పత్రుల్లో విధుల బహిష్కరణలు
- ఎక్కడికక్కడ ప్రదర్శనలు, ధర్నాలు, అధికారులకు వినతుల సమర్పణలు

ఆంధ్రజ్యోతి - న్యూస్‌నెట్‌వర్క్, ఆగస్టు 17: కోల్‌కతాలోని ఆర్‌జీ కర్ వైద్య కళాశాల ఆస్పత్రిలో ట్రైనీ పీజీ వైద్యురాలి హత్యాచారాన్ని నిరసిస్తూ ఉమ్మడి గుంటూరు జిల్లా వ్యాప్తంగా వైద్యుల నిరసనలు మిన్నంటాయి. రోగుల ప్రాణాలు నిలబెట్టే వైద్యులకే రక్షణ లేకుండా పోతుందంటూ నిరసన తెలిపారు. ఇండియన్ మెడికల్ అసోసియేషన్ (ఐఎంఏ) పిలుపు మేరకు ఎక్కడికక్కడ ప్రైవేటు వైద్యశాలలు బంద్ చేసిన వైద్యులు ప్రదర్శనలు చేపట్టారు. గుంటూరులో వైద్యులు, వైద్య విద్యార్థులు, నర్సులు లాడ్జి కూడలిలోని అంబేద్కర్ విగ్రహం నుంచి ప్రభుత్వ సమగ్రాస్పత్రి వరకు ర్యాలీ నిర్వహించారు. వైద్యులపై దాడులు చేసే వారిని నాన్ బెయిలబుల్ సెక్షన్‌తో పాటు భారీ జరిమానా విధించేలా చట్టం తేవాలని ఐఎంఏ రాష్ట్ర అధ్యక్షుడు ఎలెక్ట్ డాక్టర్ గార్లపాటి నందకిషోర్ కోరారు. టీడీపీ నాయకురాలు డాక్టర్ శనక్కాయల రాజకుమారి, భారతీయ జనతాపార్టీ మహిళా మోర్చా ఆధ్వర్యంలో గుంటూరులో మహిళలు నోటికి నల్లరిబ్బన్లు ధరించి, వెలుగుతున్న కొవ్వొత్తులతో ర్యాలీ చేశారు. వారం రోజులుగా గుంటూరు ప్రభుత్వ సమగ్రాస్పత్రిలో విధులు బహిష్కరించి ఆందోళన నిర్వహిస్తున్న జూనియర్ డాక్టర్లకు మద్దతుగా శనివారం ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ వైద్యుల సంఘం (ఏపీ జీడీఏ) గుంటూరు యూనిట్ సభ్యులు ధర్నా చేశారు. కలకత్తాలో పీజీ విద్యార్థిని ఘటనపై రజక జన సేవా సంఘం ఆధ్వర్యంలో గుంటూరులో కొవ్వొత్తులతో నిరసన జరిగింది. ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయ విద్యార్థులు కోల్‌కత్తా ఘటనకు సంతాపంగా శనివారం యూనివర్సిటీలోని అబ్దుల్ కలాం విగ్రహం నుంచి ముఖ ద్వారం వరకు నిరసన ప్రదర్శన నిర్వహించారు. పెదకాకాని మండలం తక్కెళ్లపాడు సిబార్ దంత వైద్య కళాశాల విద్యార్థులు కళాశాల నుంచి పంచాయతీ కార్యాలయం వరకు ర్యాలీ చేశారు. తెనాలి జిల్లా ప్రభుత్వవైద్యశాల వైద్యులు, సిబ్బంది విధులను బహిష్కరించి నల్లబ్యాడ్జ్‌లతో నిరసన తెలిపారు. చేబ్రోలు పరిధిలోని వడ్లమూడి డీవీసీ హాస్పల్ వైద్యులు, సిబ్బంది ఓపీ సేవలు నిలిపివేసి నిరసన ప్రదర్శన చేశారు. చినకాకాని ఎన్నారై వైద్య కళాశాల విద్యార్థులు గౌతమబుద్ధరోడు మీదగా అంబేద్కర్ సెంటర్ వరకు ర్యాలీ చేశారు. నరసరావుపేటలో ఐఎంఏ ఆధ్వర్యంలో వైద్యులు నిరసన ప్రదర్శన చేశారు. కలెక్టరేట్లో అధికారులకు, అడ్మిన్ ఏఎస్పీలకు వినతిపత్రాలు అందజేశారు. సత్తెనపల్లి ఏరియా వైద్యశాల సూపరింటెండెంట్ డాక్టర్ లక్ష్మణరావు ఆధ్వర్యంలో ఆస్పత్రి వైద్యులు, వైద్య సిబ్బంది రెండు గంటల పాటు విధులు బహిష్కరించి ఆర్డీవో కార్యాలయం వద్ద ధర్నా చేశారు. శావల్యాపురం పీహెచ్‌సీలో వైద్యసిబ్బంది నల్లబ్యాడ్జీలతో నిరసన ప్రదర్శన చేపట్టారు. పీహెచ్‌సీ నుండి శావల్యాపురం సెంటర్ వరకు ర్యాలీని నిర్వహించారు. వేమూరులోని కమ్యూనిటీ హెల్త్ సెంటర్, ప్రత్తిపాడు సామాజిక ఆరోగ్య కేంద్రంలో, కర్లపాలెం, కొల్లూరు, నాదెండ్ల, రెంటచింతల, తాళ్ళూరు, కారంపూడి, ఫిరంగిపురం మండలం నుదురుపాడు పీహెచ్‌సీ, మాచవరం, దాచేపల్లి జూనియర్ డాక్టర్‌పై అత్యాచారానికి నిరసనగా వైద్యులు, సిబ్బంది నిరసనలు తెలిపారు. మాచర్ల ప్రభుత్వ వైద్యశాల, ఇండియన్ మెడికల్ అసోసియేషన్ ఆధ్వర్యాన బస్టాండ్ సెంటర్‌లో మానవహారంగా ఏర్పడి నిరసన తెలిపారు. తహసీల్దార్ జియాఉల్‌హక్‌కు వినతిపత్రం అందించారు. చిలకలూరిపేటలో వైద్యులు వైద్య సేవలు నిలిపి వేసి నరసరావుపేట సెంటర్‌లో మానవహారంగా బహిరంగ నిరసన తెలిపారు. రేపల్లెలో ఐఎంఏ ఆధ్వర్యంలో నిరసన ర్యాలీ నిర్వహించి ఆర్డీవో హేలా షారోన్‌కు వినతిపత్రం అందించారు. బాపట్ల కొత్తబస్టాండ్ దగ్గర నుంచి గడియారస్తంభం మీదగా అంబేద్కర్ సర్కిల్ వరకు వైద్యుల నిరసన ప్రదర్శన జరిగింది.



తెనాలి జిల్లా ప్రభుత్వవైద్యశాలలో నల్లబ్యాడ్జిలతో నిరసన తెలుపుతున్న వైద్యులు, సిబ్బంది

భూముల క్రమబద్ధీకరణ జరిగేనా?

- గత ఏడాది 800 మందికి పైగా దరఖాస్తు
- ప్రభుత్వం మారడంతో ఉత్తర్వులు పెండింగ్
- కూటమి సర్కారు దృష్టి పెట్టాలంటున్న యజమానులు



గుంటూరు, ఆగస్టు 17 (ఆంధ్రజ్యోతి): పట్టణ భూపరిమితుల చట్టం(యూఎల్‌సీ) కింద సీలింగ్ భూముల క్రమబద్ధీకరణ ఎండమావిగా మారింది. గత కొన్నేళ్లుగా ప్రభుత్వం రెగ్యులరైజేషన్ జీవోలు ఇవ్వడం, వాటికి ఆశపడి భూ యజమానులు దరఖాస్తు చేసుకోవడం, ఆ తర్వాత ఏదో ఒక సాకు చూపించి క్రమబద్ధీకరణ చేయకపోవడం పరిపాటిగా మారింది. చివరిసారిగా కొన్ని నిబంధనలను సడలించి గత ఏడాది డిసెంబరు నెలాఖరు వరకు దరఖాస్తుకు అనుమతి ఇచ్చింది. అయితే ఆ తర్వాత ఎన్నికల వాతావరణం వచ్చేయడంతో నేటి వరకు రెగ్యులరైజేషన్‌కు సంబంధించి ఎలాంటి నిర్ణయం రెవెన్యూ శాఖ నుంచి వెలువడలేదు. ప్రస్తుతం ఎన్‌డీఏ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన దృష్ట్యా తమ దరఖాస్తుల విషయంలో తుది నిర్ణయం తీసుకోవాలని భూయజమానులు కోరుతున్నారు. జిల్లాలో అర్బన్ ల్యాండ్ సీలింగ్ కింద ఐదు రెవెన్యూ గ్రామాల కింద సీలింగ్ భూములను గుర్తించారు. గుంటూరు, కొరిటెపాడు, నల్లపాడు, ఆర్ అగ్రహారం, అంకిరెడ్డిపాలెం రెవెన్యూ గ్రామాల్లో 98 హెక్టార్ల సీలింగ్ భూములున్నాయి. నగర జనాభా పెరిగిపోవడంతో సీలింగ్ భూములన్నింటిలో పెద్ద పెద్ద భవనాల నిర్మాణం జరిగాయి. వీటిపై రిజిస్ట్రేషన్లు జరుగుతున్నా సంపూర్ణ హక్కుల కల్పన జరగడం లేదు. 2019 మే ఒకటో తేదీ నాటికి ఆయా స్థలాల్లో నివాసం ఉన్న వారికి రిజిష్టర్డ్ డాక్యుమెంట్ ఉంటే వారంతా క్రమబద్ధీకరించుకునేందుకు దరఖాస్తు చేసుకునే అవకాశాన్ని గత ఏడాది ప్రభుత్వం కల్పించింది. 150 చదరపు గజాల వరకు ప్రభుత్వం నిర్దేశించిన అర్హతలు ఉన్న వారికి ఉచితంగానే డీ-పట్టా మంజూరు చేస్తామని ప్రకటించారు. 150 నుంచి 300 చదరపు గజాల వరకు బేసిక్ విలువలో 15 శాతం ప్రభుత్వానికి చెల్లించాలి. అదే 300 నుంచి 500 చదరపు గజాల వరకు అయితే మూల విలువలో 30 శాతం, 500 చదరపు గజాల పైన అయితే 100 శాతం బేసిక్ విలువని చెల్లించాలని నిబంధనలు పెట్టింది. జిల్లా కలెక్టర్ చైర్మన్‌గా దరఖాస్తుల పరిశీలనకు ఒక కమిటీని కూడా ప్రభుత్వం అప్పట్లో నియమించింది. జాయింట్ కలెక్టర్‌ని మెంబర్ సెక్రెటరీగా, సభ్యులుగా గుంటూరు ఆర్‌డీవో, జిల్లా సర్వే అధికారి, రిజిస్ట్రార్‌లను నియమించింది. ఆ మేరకు జిల్లాలో 800లకు పైగా దరఖాస్తులు వచ్చినట్లు రెవెన్యూవర్గాలు తెలిపాయి. వాటిని ప్రభుత్వానికి నివేదించామని, అయితే అక్కడి నుంచి ఇంకా ఎలాంటి ఆర్డర్స్ రాలేదని చెబుతున్నాయి. కాగా 150 చదరపు గజాలకు పైగా విస్తీర్ణం కలిగిన కేటిగిరీలకు చెందిన వారు నగదు చెల్లించి దాదాపుగా ఎనిమిది నెలలు పూర్తి కావొస్తున్నది. దీంతో వారంతా ఆవేదన చెందుతున్నారు.

21న జిల్లా అథ్లెటిక్ జట్ల ఎంపికలు

గుంటూరు(తూర్పు), ఆగస్టు 17: అథ్లెటిక్ అసోసియేషన్ ఆఫ్ గుంటూరు జిల్లా ఆధ్వర్యంలో స్థానిక ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం క్రీడామైదానంలో జిల్లా అథ్లెటిక్స్ జట్ల ఎంపిక నిర్వహిస్తున్నట్లు సంఘం కార్యదర్శి జీవీఎస్ ప్రసాద్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. అండర్ 14, 16 18, 20, బాలబాలికల విభాగాల్లో జరుగుతాయని తెలిపారు. ఎంపికైన క్రీడాకారులు సెప్టెంబరులో ఏఎన్‌యూలో జరిగే రాష్ట్రస్థాయి అథ్లెటిక్స్ పోటీల్లో పాల్గొంటారని తెలిపారు. జిల్లా ఎంపికల్లో పాల్గొనే క్రీడాకారులు అదే రోజున ఉదయం 9 గంటలకు సింథటిక్ ట్రాక్‌లో తమ వయసు ధ్రువీకరణ పత్రంతోపాటు ఆధార్‌కార్డు జిరాక్స్ తీసుకొని రిపోర్ట్ చేయాలని కోరారు. ఇతర వివరాలకు 96666 35296 ఫోన్ నెంబరును సంప్రదించాలని సూచించారు.

ఉత్తమ ఉపాధ్యాయ అవార్డుల కోసం
22 లోగా దరఖాస్తు చేసుకోవాలి

గుంటూరు(విద్య), ఆగస్టు 17: ఉత్తమ ఉపాధ్యాయ అవార్డుల కోసం ఈనెల 22లోగా దరఖాస్తు చేసుకోవాలని డీఈవో పి.శైలజ శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఉపాధ్యాయులు, హెచ్‌ఎంలు 22లోగా దరఖాస్తులు ఎంఈవోలకు అందజేయాలని, ఎంఈవోలు వాటిని పరిశీలించి 24న డీవైఈవోకు అందజేస్తారని తెలిపారు. డీవైఈవోలు 27 లోగా జిల్లా విద్యాశాఖకు దరఖాస్తులు అందజేయాలని సూచించారు. దరఖాస్తుదారులకు కనీసం 15 సంవత్సరాల సర్వీస్ ఉండాలని, ఎటువంటి క్రమశిక్షణా చర్యలకు లోనై ఉండరాదని స్పష్టం చేశారు.

మైనార్టీ సంక్షేమశాఖ వసతిగృహంలో
ప్రవేశానికి దరఖాస్తుల ఆహ్వానం

గుంటూరు(విద్య), ఆగస్టు 17: మైనార్టీ సంక్షేమశాఖ ఆధ్వర్యంలో నిర్వహించే ప్రీ, పోస్టుమెట్రిక్ బాలికల వసతిగృహాల్లో ప్రవేశానికి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు జిల్లా మైనార్టీ సంక్షేమశాఖాధికారి శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ప్రీమెట్రిక్ మైనార్టీ వసతి గృహం రవీంద్రనగర్ 1వలైనులో, పోస్టుమెట్రిక్ బాలకల వసతి గృహం పొన్నూరు రోడ్డులోని ఆనందపేటలో నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఆయా హాస్టల్స్‌లో వసతి పొందాలనుకునేవారు సంబంధిత హాస్టల్ వెల్ఫేర్ ఆఫీసర్‌ను సంప్రదించాలని (93921 05096, 88044 22522)సూచించారు.

ఉపాధి కార్మికులకు వేతన బకాయిల విడుదల

● జిల్లాకు రూ.51.95 కోట్లు విడుదల

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

నరసరావుపేట, ఆగస్టు 17(ఆంధ్రజ్యోతి): ఎట్టకేలకు ఉపాధి హామీ పథకం కార్మికులకు వేతనాలు చెల్లించారు. జిల్లాలోని కార్మికుల బ్యాంకు ఖాతాలకు రూ.51.95కోట్లు జమ చేశారు. పనిచేసినా పస్తులే అనే శీర్షికతో ఆంధ్రజ్యోతిలో వెలువడిన కథనంపై ప్రభుత్వం స్పందించింది. సుమారు 84 రోజులకు సంబంధించిన వేతనాలను కార్మికులకు అందజేశారు. మే 21 నుంచి ఆగస్టు 12 వరకు వేతన బకాయిలు డీబీటీ పద్ధతిలో వేతనదారుల బ్యాంకు ఖాతాలకు జమ చేయడం జరిగిందని జిల్లా నీటి యాజమాన్య సంస్థ సంచాలకులు జీ జోసఫ్ కుమార్ శనివారం తెలిపారు.

నూతక్కి పీఏసీఎస్‌కి వరల్డ్ లార్జెస్టు గ్రెయిన్ ప్రాజెక్టు

● పైలట్ ప్రాజెక్టుగా అమలు
● నిధులు సమకూర్చనున్న కేంద్ర ప్రభుత్వరంగ సంస్థలు
● రూ.2కోట్ల వరకు మంజూరయ్యే అవకాశం

గుంటూరు, ఆగస్టు 17 (ఆంధ్రజ్యోతి): దేశంలో తిండిగింజల కొరతని అధిగమించేందుకు కేంద్ర ప్రభుత్వం అమలులోకి తెచ్చిన వరల్డ్ లార్జెస్టు గ్రెయిన్ స్టోరేజ్ ప్రాజెక్టుకి జిల్లాలో మంగళగిరికి సమీపంలోని నూతక్కి ప్రాథమిక వ్యవసాయ పరపతి సంఘం ఎంపికైంది. పైలట్ ప్రాజెక్టుగా దీనిని వివిధ ఆర్థికసంస్థల సహకారంతో అమలు చేయనున్నారు. దీనికి సంబంధించిన పనులు సాధ్యమైనంత త్వరగా ప్రారంభించాలని సహకార, పంచాయతీరాజ్ శాఖల అధికారులకు ప్రభుత్వం నుంచి ఆదేశాలు జారీ అయ్యాయి. అటు రైతులకు, ఇటు ప్రజలకు ఎంతో మేలు చేకూర్చనున్న ఈ ప్రాజెక్టుని సాధ్యమైనంత త్వరగా పూర్తిచేసి వినియోగంలోకి తెచ్చేందుకు జిల్లా యంత్రాంగం చర్యలు చేపట్టింది. దీంతోపాటే ఇతర పీఏసీఎస్‌లని బలోపేతం చేయడం పైనా దృష్టి సారించింది. ఇందుకోసం జాయింట్ కలెక్టర్ ఏ భార్గవతేజ పీఏసీఎస్‌ల సందర్శన, సంబంధిత శాఖల అధికారులు, కలెక్టర్ నాగలక్ష్మి సమీక్షలు చేస్తున్నారు.

పీఏసీఎస్ స్థాయిలోనే వ్యవసాయ మౌలికసదుపాయాల కల్పన ప్రధానలక్ష్యంగా ఈ ప్రాజెక్టుని కేంద్రం అమలుచేస్తున్నది. ఇందులో భాగంగా గోడౌన్ల వికేంద్రీకరణ చేయడం, కస్టమ్ హైరింగ్ సెంటర్లు, ప్రాసెసింగ్ యూనిట్ల ఏర్పాటు, ప్రజలకు చౌకధరలకే వ్యవసాయ ఉత్పత్తులను అందుబాటులో ఉంచే దుకాణాలు ఏర్పాటుచేస్తారు. కేంద్ర ప్రభుత్వ పథకాలైన అగ్రికల్చర్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ ఫండ్(ఏఐఎఫ్), అగ్రికల్చర్ మార్కెటింగ్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ స్కీమ్(ఏఎంఐ), సబ్‌మిషన్ ఆన్ అగ్రికల్చర్ మెకనైజేషన్ (ఎస్‌ఎంఏఎం), ప్రధానమంత్రి ఫార్మలైజేషన్ ఆఫ్ మైక్రో ఫుడ్ ప్రాసెసింగ్ ఎంటర్‌ప్రైజెస్ స్కీమ్(పీఎంఎఫ్ఎంఈ) వంటివి వీటికి వర్తింపుచేస్తారు. ఈ స్కీమ్‌ల ద్వారా పీఏసీఎల్‌లు సబ్సిడీలు, వడ్డీ లేని రుణాలు పొంది గోడౌన్‌లు, ఇతర మౌలిక సదుపాయాలను నిర్మించుకోవచ్చు. అంతేకాకుండా నాబార్డు కూడా తన వంతు మద్దతుని ఇస్తుంది. రీఫైనాన్సింగ్ సౌకర్యాన్ని ఒక శాతానికే ఇస్తుంది. ఏఐఎఫ్ స్కీమ్ ద్వారా రూ.2కోట్లు పొందవచ్చు. పీఏసీఎస్‌ల వ్యాపార కార్యకలాపాలను మార్చేసి స్థిరత్వం తీసుకు రావడమే పైలట్ ప్రాజెక్టు లక్ష్యంగా ఉన్నది.

ఈ పైలట్ ప్రాజెక్టుని ఎన్‌సీడీసీ, ఎఫ్‌సీఐ, సీడబ్ల్యూసీ, ఎన్‌ఏబీసీవీఎస్, ఎన్‌బీసీసీ వంటి సంస్థలు కలిసి అమలుచేసేందుకు అంగీకరించాయి. పైలట్ ప్రాజెక్టుకి ఎంపికైన నూతక్కి పీఏసీఎస్‌కి కన్‌సల్టెన్సీ సపోర్టు కూడా ఇస్తారు. పీఏసీఎస్ స్థాయిలో నిల్వ సామర్థ్యం వికేంద్రీకరణ వలన పంటలు కోసిన తర్వాత జరుగుతున్న నష్టాలను నియంత్రించొచ్చు. అంతేగాక గ్రామస్థాయిలో ఆహారభద్రత ఉంటుంది. స్టోరేజ్‌లు సమృద్ధిగా అందుబాటులో ఉండటం వలన మార్కెట్‌లో ధర తగ్గినప్పుడు వీటిల్లో నిల్వ చేసుకోవచ్చు. పీఏసీఎస్‌లు సేకరణ కేంద్రాలుగానే కాకుండా ఫెయిర్ ప్రైస్ షాపులుగా కూడా వ్యవహరిస్తాయి. ఈ కారణంగా రవాణ ఖర్చులు తగ్గుతాయి. గోడౌన్లలో నిల్వచేసిన ఉత్పత్తులపై బ్రిడ్జి రుణాలు కూడా పొందే అవకాశం కల్పిస్తారు. దానివలన మార్కెట్‌లో ధర పెరిగినప్పుడు ఉత్పత్తులను అమ్ముకోవచ్చు. విత్తనాలు, ఎరువులు, పురుగుమందులు వంటివి కూడా గ్రామస్థాయిలోనే లభిస్తాయి. వ్యాపారంలో వైవిధ్యం వలన రైతులకు అదనపు ఆదాయం వస్తుందని కేంద్రం చెబుతున్నది. ఫుడ్ సప్లై మేనేజ్‌మెంట్ చైన్‌ని సమీకృతం చేయడం వలన మార్కెట్ అవకాశాలను రైతులు పెంచుకోవచ్చు.

దేవాలయాల్లో దొంగతనాల కేసుల్లో నిందితుల అరెస్టు

● సుమారు రూ.16,99,700 విలువైన వస్తువులు స్వాధీనం



బాపట్లరూరల్, ఆగస్టు 17: దేవాలయాల్లో వరుస దొంగతనాలకు పాల్పడుతున్న ముఠాను బాపట్ల జిల్లా పోలీసులు అరెస్ట్ చేశారు. శనివారం బాపట్ల మండలం వెదుళ్ళపల్లి సెంట్రల్ క్రైమ్ పోలీసుస్టేషన్ ఆవరణంలో విలేకర్ల సమావేశంలో ఎస్పీ తుషార్‌డూడీ కేసు వివరాలను వెల్లడించారు. తెనాలికి చెందిన కారంపూడి విజయ్‌కుమార్, తాడిపత్రి సాయి, చెరుకుపల్లి మండలం రాజోలు గ్రామానికి చెందిన బండికట్ల పవన్‌కళ్యాణ్ అనే ముగ్గురు నిందితులు గత మూడునెలల నుంచి దేవాలయాలలో దొంగతనాలకు పాల్పడుతున్నారు. ఈ మధ్యకాలంలో రేపల్లె సబ్ డివిజన్ పరిధిలో ఉన్న దేవాలయాలలో దొంగతనాలకు పాల్పడ్డారు. నిందితులను శనివారం మధ్యాహ్నం చుండూరు మండలం ఆళ్ళపాడు వంతెన వద్ద పోలీసులు అదుపులోకి తీసుకొని అరెస్ట్ చేశారు. నిందితులపై గతంలో గుంటూరు, విజయవాడ, తెనాలి, పల్నాడు జిల్లాల్లో కూడా కేసులు ఉన్నాయని తెలిపారు. బాపట్ల సీసీఎస్ పోలీసుస్టేషన్ డీఎస్పీ పి.జగదీష్‌నాయక్ పర్యవేక్షణలో సీసీఎస్ ఇన్‌స్పెక్టర్ పి.ప్రేమయ్య, చుండూరు సర్కిల్ సీఐ శ్రీనివాసరావు నేతృత్వంలో ప్రత్యేక బృందాలను ఏర్పాటుచేసి నిందితులను పట్టుకున్నామన్నారు. నిందితుల నుండి రూ.6లక్షల 9వేల 700 విలువైన వెండి, రూ.10లక్షల 55వేల విలువైన 10బైక్‌లు, రూ.35వేల విలువైన స్మార్ట్ టీవీ మొత్తం రూ.16లక్షల 99వేల 700 విలువైన సొత్తు స్వాధీనం చేసుకున్నామని ఎస్పీ తెలిపారు. వీరిపై కేసు నమోదు చేసి చర్యలు తీసుకుంటామని తెలిపారు. కేసు దర్యాప్తులో ప్రతిభ కనబరిచిన పోలీసు సిబ్బందిని ఎస్పీ అభినందించారు.

నాసిరకం మద్యంతో వేల ప్రాణాలు తీసిన వాళ్లను వదలొద్దు

● తప్పుడు ప్రచారాలతో చేసిన పాపాల నుంచి తప్పించుకోలేరు
● ఎమ్మెల్యే జీవీ ఆంజనేయులు



వినుకొండ, ఆగస్టు 17: రాష్ట్రంలో 30వేల మంది ప్రజల ప్రాణాలు తీసిన వైసీపీ దొంగల ముఠాలో ఏ ఒక్కరినీ వదిలిపెట్టవద్దని ముఖ్యమంత్రి చంద్రబాబుకు ఎమ్మెల్యే జీవీ ఆంజనేయులు విజ్ఞప్తిచేశారు. వైసీపీ చేసిన నిర్వాకాలు చాలక తప్పుడు ప్రచారాలతో తప్పించుకోవాలని చూస్తున్నారని, ఒక్కొక్కర్ని అరెస్టు చేసి విచారిస్తే వాస్తవాలు బయటకు వస్తాయని శనివారం ఆయన మీడియాకు తెలిపారు. రాష్ట్రంలో మద్యం అమ్మకాలకు సంబంధించి కూటమి ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలపై మాజీ సీఎం జగన్‌రెడ్డి తప్పుడు ప్రచారాలు చేస్తున్నారని మండిపడ్డారు. సీఎం చంద్రబాబు ప్రభుత్వం పాత ప్రభుత్వ పాపాలను ప్రక్షాళన చెయ్యాలని చూస్తుంటే ఆ బురదను కూటమి ప్రభుత్వంపై చల్లాలని జగన్ సొంతమీడియా పేటీఎం బ్యాచ్‌లతో అబద్ధపు ప్రచారాలకు పూనుకుందని జీవీ ధ్వజమెత్తారు. అధికారంలోకి వచ్చిన వెంటనే జగన్‌రెడ్డి మొట్టమొదట కన్నేసింది మద్యం విధానం, అమ్మకాల్లో అక్రమాలపైనే అన్నారు. వైసీపీ హయాంలో రూ.1.24లక్షల కోట్ల మద్యాన్ని జగన్ నగదు రూపంలో అమ్మడమే అందుకు నిదర్శనమన్నారు. రాష్ట్రంలోని డిస్టిలరీలను గుప్పిట్లో పెట్టుకుని ప్రజల గొంతుల్లో విషం పోశారన్నారు. ప్రైవేట్ ల్యాబుల్లో చేయించిన పరీక్షల్లోనూ నాటి జే బ్రాండ్ మద్యం ఎంత ప్రమాదకరమైందో ఆధారాలతో నిరూపణైందన్నారు. 2019-2024 మధ్య రాష్ట్రవ్యాప్తంగా లివర్లు పాడై ప్రాణాలమీదకు తెచ్చుకున్న బాధితుల దీనగాథలు జగన్ దారుణాలకు సాక్ష్యం అన్నారు. జగన్, విజయసాయిరెడ్డి, వాసుదేవరెడ్డి, మిధున్‌రెడ్డి అధికారబలంతో డిస్టిలరీల మొత్తాన్ని గుప్పిట పెట్టుకుని ప్రజల ప్రాణాలతో చెలగాటమాడారని చెప్పారు. కూటమి ప్రభుత్వం తీసుకుంటున్న మద్యం పాలసీతో కూసాలు కదులుతాయనే జే-గ్యాంగ్‌లో కలకలం మొదలైందన్నారు.

ఐఏఎస్, ఐపీఎస్ అధికారులను అణచివేసిందే జగన్

● ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావు

చిలకలూరిపేట అర్బన్, ఆగస్టు 17: రాష్ట్రంలో సివిల్ సర్వీస్ అధికారుల పేరిట వైసీపీ జగన్ దొంగ డ్రామాలు మొదలుపెట్టారని ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావు ధ్వజమెత్తారు. కూటమి ప్రభుత్వంపై లేనిపోని నిందలు వేసే ప్రయత్నం చేస్తున్న మాజీ సీఎం జగన్‌రెడ్డి హయాంలోనే అఖిల భారత సర్వీసు అధికారులను దారుణమైన స్థితిలో అణచివేతకు గురిచేశారని మండి పడ్డారు. రాష్ట్రంలో గత ప్రభుత్వ హయాంలో తీవ్ర వివాదాస్పద ఆరోపణలు ఎదుర్కొంటున్న కొందరు ఐఏఎస్, ఐపీఎస్ అధికారులను కూటమి ప్రభుత్వం పక్కన పెట్టడంపై వైసీపీ తప్పుడు ప్రచారాలను చేస్తుందని శనివారం ప్రత్తిపాటి పత్రికా ప్రకటనలో అభ్యంతరం వ్యక్తం చేశారు. ఇప్పుడు ఇన్ని ధర్మ పన్నాలు చెపుతున్న జగన్ వైసీపీ వారు నాటి సీఎస్ ఎల్‌వీ సుబ్రహ్మణ్యం విషయంలో ఏం చేశారో గుర్తులేదా? అని ప్రశ్నించారు. సీనియర్ ఐపీఎస్ అధికారి ఏబీ వెంకటేశ్వరరావుకు ఐదు సంవత్సరాలపాటు పోస్టింగ్ ఇవ్వకుండా ఎలా వేధించింది, సస్పెన్షన్‌ల మీద సస్పెన్షలతో ఎలా ఇబ్బంది పెట్టింది మరచిపోయారా? అని ప్రశ్నించారు. అంతేగాక సివిల్ అధికారుల సర్వీస్ రిజిస్టర్లు జగన్ వద్దే పెట్టుకొని వేధించారని ఆరోపించారు. ఒక ఎంపీని లాకప్‌లో హింసించిన అధికారులపై చర్యలు తీసుకోకూడదా? అని ప్రశ్నించారు. వైసీపీ హయాంలో చేసిన తప్పులపై వారే సిగ్గుతో తలదించుకుంటున్నారని ఎద్దేవా చేశారు. తప్పు చేసిన అధికారులపై చర్యలు తీసుకోవటం తమ ప్రభుత్వ విధానమని ప్రత్తిపాటి స్పష్టం చేశారు.

మున్సిపల్ చైర్మన్ ఏసోబు రాజీనామా



రాజీనామా పత్రాన్ని అందిస్తున్న చిన ఏసోబు

మాచర్ల టౌన్, ఆగస్టు 17: మాచర్ల పట్టణ మున్సిపల్ చైర్మన్ మాచర్ల చిన ఏసోబు శనివారం తన పదవికి రాజీనామా చేశారు. అనారోగ్య కారణాలతో రాజీనామా చేస్తున్నట్లు చెప్పారు. తన రాజీనామా పత్రాన్ని టౌన్ ప్లానింగ్ అధికారి నాగేశ్వరరావుకు అందజేశారు.

ప్రకాశం బ్యారేజి దిగువకు 40 వేల క్యూసెక్కులు

● డెల్టా కాలువలకు 17వేల 400 క్యూసెక్కులు



ప్రకాశం బ్యారేజి నుంచి దిగువకు విడుదల అవుతున్న వరదనీరు

తాడేపల్లి టౌన్, ఆగస్టు 17: ఎగువ ప్రాజెక్టుల నుండి నీటిని విడుదల చేస్తుండడంతో ప్రకాశం బ్యారేజి నుండి దిగువకు నీటిని విడుదల కొనసాగుతోంది. ఎగువన ఉన్న పులిచింతల ప్రాజెక్టు నుండి 55వేల 200, కీసర వాగు నుండి 2వేల 300 క్యూసెక్కుల వంతున మొత్తం 57 వేల 500 క్యూసెక్కుల వరద నీరు శని వారం ప్రకాశం బ్యారేజి వద్దకు చేరుతున్నట్టు నీటిపారుదల శాఖ జేఈ దినేష్ తెలిపారు. బ్యారేజి రిజర్వాయర్‌లో 12 అడుగుల నీటిమట్టం కొనసాగుతుండగా 55 గేట్లను 1 అడుగు వంతున ఎత్తి దిగువకు 40వేల 150 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు. అలాగే తూర్పు, పశ్చిమ డెల్టా కాలువలకు 17వేల 400 క్యూసెక్కుల నీటిని వదులుతున్నట్టు జేఈ తెలిపారు.

పశ్చిమడెల్టాకాల్వకు 7837 క్యూసెక్కుల నీరు

దుగ్గిరాల, ఆగస్టు 17: విజయవాడ ప్రకాశం బ్యారేజి నుంచి పశ్చిమడెల్టా కాల్వకు 7837 క్యూసెక్కుల సాగునీటిని శనివారం విడుదల చేసినట్లు నీటిపారుదలశాఖ అధికారులు తెలిపారు. దుగ్గిరాల సబ్‌డివిజన్ నుంచి హైలెవెల్ ఛానల్‌కు 336, రేపల్లెకాల్వకు 1861, తూర్పుకాల్వకు 765, పశ్చిమకాల్వకు 280, నిజాంప ట్నంకాల్వకు 450, కొమ్మమూరుకాల్వకు 3040క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు.

వర్సిటీలో రేపు ప్రపంచ ఫొటోగ్రాఫర్ల దినోత్సవం

● పలువురు ఫొటోగ్రాఫర్లకు బహుమతుల ప్రదానం
● ముఖ్య అతిథిగా హాజరుకానున్న మండలి బుద్ధప్రసాద్

పెదకాకాని, ఆగస్టు 17: ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయంలో ఈనెల 19 వరల్డ్ ఫొటోగ్రఫీ వేడుకలు నిర్వహిస్తున్నట్లు జర్నలిజం విభాగాధిపతి డాక్టర్ జి.అనిత శనివారం తెలిపారు. అదే రోజు పలువురు ఫొటోగ్రాఫర్లకు బహుమతులు అందజేయనున్నట్లు ఆమె తెలిపారు. ఫొటోగ్రఫీ డిప్లమా కోర్సు ఆధ్వర్యంలో నిర్వహించిన వివిధ పోటీలలో ఉత్తమ ప్రతిభ కనబరిచిన ఫొటోగ్రాఫర్లకు అదే రోజున ఎంఎల్ఏ మండలి బుద్ధప్రసాద్ చేతులమీదుగా బహుమతి ప్రదానం చేయనున్నారు. ఉదయం 11 గంటలకు ఇంజనీరింగ్ కళాశాలలోని ఎన్ఐడీ బ్లాక్‌లో ఉన్న ప్రొఫెసర్ వై.ఆర్.హరిగోపాల్‌రెడ్డి సెమినార్ హాల్లో ఈ కార్యక్రమం జరుగుతుందని పేర్కొన్నారు.

పోటీలలో విజేతలు...

ఫొటోగ్రఫీ విభాగం నిర్వహించిన కాంటెస్ట్‌లో విజేతలను ప్రకటించారు. వారిలో మోనోక్రోమ్ విభాగంలో ఉత్తమ ఫోటోకు బ్రహ్మయ్య వంగపల్లి, కలర్ ఫోటో విభాగంలో వానం శరత్‌బాబు, నేచర్ అండ్ వైల్డ్‌లైఫ్ విభాగంలో బి.సుబ్రహ్మణ్యం, ఫొటో జర్నలిజం విభాగంలో ఉదయన్ శంకర్‌పాల్, ట్రావెల్ ఫొటోగ్రఫీలో అర్రబోయిన శంకర్ విజేతలుగా నిలిచారు. వీరితోపాటు ప్రోత్సాహక బహుమతులను కూడా అందించనున్నట్లు డాక్టర్ జి.అనిత తెలిపారు.

పులిచింతలకు 48వేలు...

● 1.0074 ఎంయుల విద్యుదత్పత్తి.. ఎస్ఈ వెంకటరమణ

రెంటచింతల, ఆగస్టు 17: సత్రశాలలోని కృష్ణానది వద్ద నిర్మితమైన నాగార్జునసాగర్ టెయిల్‌పాండ్ ప్రాజెక్టులో శుక్రవారం అర్ధరాత్రి 12 గంటల వరకు రెండు యూనిట్ల ద్వారా 1.0074 ఎంయూల విద్యుత్ తయారైనట్లు ఎస్ఈ కె.వెంకటరమణ చెప్పారు. ప్రాజెక్టుకు చెందిన 3 గేట్లను 2 మీటర్ల మేర, 1 గేట్‌ను 1 మీటర్ మేర ఎత్తి పులిచింతలకు 39,652 క్యూసెక్కులు, విద్యుత్ తయారీ అనంతరం టేల్‌రేస్ ఛానల్ ద్వారా 8348, మొత్తం 48 వేల క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేస్తున్నామన్నారు. ప్రస్తుతం రిజర్వాయర్‌లో 74.30 మీటర్ల మేర నీరుండగా ఆ నీరు 7 టీఎంసీలకు సమానమన్నారు.ఎగువన వున్న సాగర్ నుంచి 48 వేల క్యూసెక్కులు నీరు వచ్చి రిజర్వాయర్‌కు చేరుతుందన్నారు.

పులిచింతల సమాచారం

అచ్చంపేట, ఆగస్టు 17 : పులిచింతల ప్రాజెక్టులో శనివారం 42.16 టీఎంసీల నీటి నిల్వ ఉన్నట్టు పులిచింతల ప్రాజెక్టు ఏఈ రాజు తెలిపారు. ఎగువ నుంచి 57,685 క్యూసెక్కుల నీరు ప్రాజెక్టుకు చేరుతుంది. ప్రాజెక్టు వద్ద రెండు గేట్ల ద్వారా 57,685 క్యూసెక్కుల నీరు దిగువ కృష్ణకు విడుదల అవుతుంది. దీనిలో పవర్ జనరేషన్ ద్వారా 16వేల క్యూసెక్కుల నీరు విడుదల అవుతున్నాయి.

రెండు క్రస్ట్‌గేట్ల ద్వారా నీటి విడుదల

మాచర్ల రూరల్, ఆగస్టు 17: నాగార్జునసాగర్ ప్రాజెక్ట్ అధికారులు శనివారం ప్రాజెక్ట్ రెండు క్రస్ట్ గేట్ల ద్వారా నీటిని దిగువకు విడుదల చేశారు. రెండు గేట్లను ఏడు అడుగుల మేర ఎత్తి 22,400 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు. కాగా సాగర్ జలాశయం నీటిమట్టం 590.00 అడుగులు ఉంది. ఇది 312.04 టీఎంసీలకు సమానం. కుడి కాలువ ద్వారా 8375 క్యూసెక్కులు, ఎడమ కాలువ ద్వారా 7518, ప్రధాన జలవిద్యుత్ కేంద్రం ద్వారా 29,191, రెండు క్రస్ట్ గేట్ల ద్వారా 22,400, ఎస్ఎల్‌బీసీ ద్వారా 1800, ఎల్ఎల్‌సీ ద్వారా 600, మొత్తం ఔట్‌ఫ్లో వాటర్‌గా 69,884 క్యూసెక్కుల నీరు విడుదల చేస్తున్నారు. శ్రీశైలం నుంచి నాగార్జునసాగర్‌కు ఇన్‌ఫ్లో వాటర్‌గా 69,884 క్యూసెక్కుల నీరు వచ్చి చేరుతోంది.

అప్పుల బాధతో కౌలురైతు ఆత్మహత్య



ఆంజనేయులు మృతదేహం

గురజాలటౌన్, ఆగస్టు 17: అప్పులబాధతో కౌలు రైతు ఆత్మహత్య చేసుకున్న సంఘటన మండలంలోని తేలుకుట్లలో జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. తేలుకుట్ల గ్రామానికి చెందిన గుండాల ఆంజనేయులు (24) గత ఏడాది గ్రామంలో 6.5 ఎకరాలను కౌలుకు తీసుకొని పత్తి, మిర్చి సాగు చేశాడు. పంట సాగు పెట్టుబడికి రూ.9లక్షల వరకు అప్పులు అయ్యాయి. పంటసాగు దెబ్బతినడంతో అప్పులు ఎలా తీర్చాలో అర్థంకాక శనివారం ఉదయం బావిలో దూకి ఆత్మహత్య చేసుకున్నాడు. గమనించిన స్థానికులు బావి నుంచి బయటకు తీసి గురజాల ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. కాగా అప్పటికే మృతిచెందినట్లు వైద్యులు తెలిపారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. మృతునికి భార్య కుమారుడు ఉన్నారు.

మద్యం మత్తులో కాల్వలో పడి వ్యక్తి మృతి



షేక్ అల్లాభక్షు మృతదేహం

ముప్పాళ్ళ, ఆగస్టు 17: కాలువ గట్టుపై కూర్చొని మద్యం తాగుతూ కాలువలో జారిపడి వ్యక్తి మృతి చెందిన సంఘటన శనివారం మధ్యాహ్నం పెదనందిపాడు బ్రాంచ్ కెనాల్ వద్ద జరిగింది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. నార్నెపాడుకు చెందిన షేక్ అల్లాభక్షు(40) పెదనందిపాడు బ్రాంచ్ కెనాల్ గట్టు పై కూర్చొని మద్యం తాగుతూ ఉన్నాడు. ఈక్రమంలో కాలువలో జారిపడి మృతి చెందాడు. స్థానికుల సమాచారం మేరకు ఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు కాలువలో కొట్టుకుపోయి చెట్ల కంపలకు చిక్కుకొనివున్న అల్లాభక్షు మృత దేహాన్ని గుర్తించి ఒడ్డుకు తీసుకు వచ్చారు. మృతుడికి భార్య అప్సర ఉన్నారు. మృతుని కుటుంబ సభ్యులు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాపుత చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

కారు అదుపు తప్పి ఇద్దరు మృతి



దుర్గాప్రసాద్ మృతదేహం



వెంకటేశ్వరరావు మృతదేహం

తెనాలి రూరల్, ఆగస్టు 17: కారు అదుపు తప్పిన ఘటనలో ఇద్దరు దుర్మరణం చెందిన సంఘటన తెనాలి మండలం పెదరావూరు శివారులో చోటుచేసుకుంది. రూరల్ ఎస్ఐ కోటేశ్వరరావు తెలిపిన వివరాల ప్రకారం పెదకాకానికి చెందిన దుర్గాప్రసాద్ గుంటూరులో ఉంటూ కారు బాడుగలకు నడుపుతుంటాడు. ఆ క్రమంలోనే శుక్రవారం రాత్రి గుంటూరు నుండి వెల్లటూరుకు బాడుగకు వచ్చాడు. ప్రయాణీకులను దించి తిరుగు ప్రయాణమయ్యాడు. ఆ వెళ్లే క్రమంలో వెల్లటూరులో అదే గ్రామానికి చెందిన గుంటూరు వెంకటేశ్వరరావు(48) తెనాలి వెళ్లేందుకు ఎక్కించుకున్నాడు. వీరు ప్రయాణిస్తున్న కారు పెదరావూరు గ్రామ శివారుకు చేరుకోగానే అదుపుతప్పి రోడ్డు వెంబడి ఉన్న డివైడర్‌ను ఢీ కొట్టింది. ఈ ఘటనలో కారులో ఉన్న ఇరువురు అక్కడికక్కడే మృతి చెందారు. కారు నడిపే యలమందల దుర్గాప్రసాద్(35)కి భార్య, ఇద్దరు చిన్నారులున్నారు. వెంకటేశ్వరరావుకి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. ఆయన తెనాలిలోని ఓ ఆశ్రమంలో పనిచేస్తున్నాడు. వీరి మృతితో ఇరు కుటుంబాల్లో విషాదం నెలకొంది. ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ పేర్కొన్నారు.

నెక్ సూచించిన కోడిగుడ్ల ధర

● విజయవాడ జోన్ ప్లాస్టిక్ ట్రేలో సరఫరా చేసే ఫారం గేటు గుడ్డు ధర రూ.4.96 ● నెక్ విజయవాడ ఆఫీస్ ఫోన్: 74165 82559

బ్రాయిలర్ ధరలు

అమరావతి పౌల్ట్రీ ఫార్మర్స్ & ట్రేడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్

బ్రాయిలర్ బర్డ్	111, 119,130
చికెన్ విత్ స్కిన్	210.00
చికెన్ స్కిన్ లెస్	220.00

గుంటూరు సిటీ వార్తలు

◆ గుంటూరు తూర్పు ◆ పశ్చిమ

జిల్లా విజన్ యాక్షన్ ప్లాన్‌ని సిద్ధం చేయాలి

● ప్రణాళిక శాఖ ప్రిన్సిపల్ సెక్రెటరీ పీయూష్‌కుమార్



పీయూష్‌కుమార్ నిర్వహించిన వీసీకి హాజరైన జిల్లా అధికారులు

గుంటూరు, ఆగస్టు 17 (ఆంధ్రజ్యోతి): వికసిత్ ఆంధ్రప్రదేశ్ 2047లో భాగంగా జిల్లాలోని అన్ని శాఖలు విజన్ యాక్షన్ ప్లాన్‌ను సిద్ధం చేసి అందించాలని రాష్ట్ర ప్లానింగ్ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ పీయూష్ కుమార్ ఆదేశించారు. రాష్ట్ర సచివాలయం నుంచి ఆయన వికసిత్ ఆంధ్రప్రదేశ్ 2047 జిల్లాల విజన్ యాక్షన్ ప్లాన్ సిద్ధం చేయటంపై జిల్లా అధికారులతో శనివారం వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమావేశం నిర్వహించారు. పీయూష్ కుమార్ మాట్లాడుతూ వికసిత్ ఆంధ్రప్రదేశ్ 2047లో ప్రతి సంవత్సరం రాష్ట్రంలోని అభివృద్ధి, సంక్షేమ రంగాల్లో 15 శాతం తగ్గకుండా వృద్ధి సాధించాలి. ఆ లక్ష్యంగా సీఎం చంద్రబాబునాయుడు అన్ని శాఖలలో మేక్రో టూ మైక్రో వరకు కార్యక్రమాల అమలుకు రాష్ట్ర, జిల్లా విజన్ యాక్షన్ ప్లాన్‌ను అక్టోబరు 2న ఆవిష్కరించటం జరుగుతుందన్నారు.

వీడియో కాన్ఫరెన్స్‌కు కలెక్టరేట్ వీసీ సమావేశ మందిరం నుంచి పాల్గొన్న ముఖ్య ప్రణాళికా అధికారిణి శేషశ్రీ మాట్లాడుతూ విజన్ యాక్షన్ ప్లాన్ రూపొందించటంపై జిల్లా అధికారులకు వర్క్‌షాపు నిర్వహించటం జరిగిందన్నారు. విజన్ యాక్షన్ ప్లాన్‌ను పర్యవేక్షించటానికి ప్రత్యేక కంట్రోల్ రూంను కలెక్టర్ ఎస్ నాగలక్ష్మి సూచనలతో ఏర్పాటు చేయటం జరుగుతుందని వివరించారు. వీడియో కాన్ఫరెన్స్ ప్రారంభానికి ముందు జిల్లా విజన్ యాక్షన్ ప్లాన్ రూపొందించటంపై ఇటీవల రాష్ట్ర స్థాయిలో శిక్షణ పొందిన సీపీవో శేషశ్రీ, జిల్లా ఉద్యానశాఖ అధికారి రవీందర్, జిల్లా స్కిల్ డెవలప్‌మెంట్ అధికారి ప్రణయ్ జిల్లా అధికారులకు విజన్ యాక్షన్ సర్వీస్ సెంటరు, సబ్ సెక్టార్ ప్లాన్ రూపొందించ టానికి నిర్దేశించిన లక్ష్యాలు, అంశాలను పవర్ పాయింట్ ద్వారా వివరించారు. ఈ సమావేశంలో డీఎఫ్ఓ మహబూబ్ బాషా, జిల్లా పంచాయితీ రాజ్ ఇంజనీరింగ్ ఎస్ఈ బ్రహ్మయ్య, బీసీ కార్పోరేషన్ ఈడీ దుర్గాబాయి, ఆర్ డబ్ల్యు ఎస్ ఎస్ఈ సురేష్, ఆర్ అండ్ బీ ఈఈ సమర్పణరావు, డ్వామా పీడీ ఉమాదేవి, డీఆర్డీఏ పీడీ హరిహరనాథ్, మైనింగ్ ఏడీ చంద్రశేఖర్, జిల్లా మత్స్య శాఖ అధికారి గాలి దేముడు, జిల్లా పరిషత్ డిప్యూటీ సీఈఓ మోహనరావు, డీఎంహెచ్ఓ డాక్టర్ విజయలక్ష్మి, సమగ్రశిక్ష ఏపీసీ విజయలక్ష్మి, డీఈవో శైలజ, జిల్లా మహిళాభివృద్ధి, శిశు సంక్షేమ శాఖ పీడీ ఉమాదేవి, జిల్లా చేనేత, జౌళి శాఖ ఏడీ వనజ, జిల్లా పౌర సరఫరాల అధికారి కోమలి పద్మ, జిల్లా సివిల్ సప్లయిస్ కార్పొరేషన్ డీఎం శ్రీలక్ష్మి, జిల్లా వ్యవసాయశాఖ అధికారి నున్న వెంకటేశ్వర్లు, జిల్లా గిరిజన సంక్షేమ శాఖ అధికారి శిరిష, ఇరిగేషన్ ఎస్ఈ ఉమామహేశ్వరరావు, డీపీఓ శ్రీదేవి, జిల్లా విభిన్న ప్రతిభావంతుల శాఖ ఏడీ సువార్త, హౌసింగ్ పీడీ వేణుగోపాల్, ఎన్టీఆర్ ఆరోగ్యసేవ జిల్లా కో ఆర్డినేటర్ డాక్టర్ విజయప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.

మైనార్టీల పాత పథకాలపై చంద్రబాబు నిర్ణయం హర్షణీయం : ఎస్ఎం షరీఫ్

గుంటూరు, ఆగస్టు 17 : మైనార్టీల పాత పథకాలు పునరుద్ధరిస్తామని ముఖ్యమంత్రి చంద్రబాబు తెలపడం హర్షణీయమని మైనారిటీ ఆశయ సాధన సమితి అధ్యక్షుడు ఎస్ఎం షరీఫ్ అన్నారు. ఈ మేరకు శనివారం ఆయన మీడియాతో మాట్లాడుతూ గత ప్రభుత్వం మైనార్టీ ఫైనాన్స్ కార్పొరేషన్‌ని పూర్తిగా నిర్లక్ష్యం చేసిందన్నారు. దీనితో ఆ సంస్థ నిర్వీర్యం అయిందని వాపోయారు. 2017లో చంద్రబాబు మైనార్టీల సాధికారత కోసం ప్రధానమంత్రి జీవన్ వికాస్ పథకం కింద కేంద్ర నిధులు తీసుకువచ్చి అలానే మ్యాచింగ్ గ్రాంట్ కింద 10 శాతం రాష్ట్ర నిధులను కేటాయించారన్నారు.

గత వైసీపీ ప్రభుత్వంలో ఎస్సీ, ఎస్టీల అణచివేత : ధారూనాయక్

గుంటూరు, ఆగస్టు 17 : దళిత, గిరిజనులపై దాడులు, హత్యలు, అత్యాచారాలు జగన్ హయాంలో ఇష్టారాజ్యంగా సాగాయని టీడీపీ రాష్ట్ర ఎస్టీ సెల్ అధ్యక్షుడు ధారూనాయక్ అన్నారు. రాష్ట్ర చరిత్రలో ఎన్నడూ లేని విధంగా వైసీపీ ఐదేళ్ల పాలనలో వారిపై అరాచకాలు పెరిగిపోయాయని, వారి మాన, ప్రాణాలకు ఏ మాత్రం రక్షణ లేకుండా పోయిందన్నారు. అయినా జగన్ కనీసం స్పందించలే దన్నారు. ముఖ్యమంత్రి అధ్యక్షతన ఏటా జనవరి, జూలై నెలల్లో ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ చట్టం అమలు తీరుపై హైపవర్ కమిటీ సమావేశాలు తప్పనిసరిగా నిర్వహించాలని చట్టం చెపుతుందన్నారు. జగన్ ఐదేళ్ల పాలనలో ఒకే ఒక్కసారి 2021లో నిర్వహించారు. ఆ తర్వాత సమీక్ష ఊసేలేదు, కానీ ఎన్డీయే ప్రభుత్వం అధికారం చేపట్టిన నెల రోజుల్లోనే ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ చట్టం అమలుపై నిర్దేశిత కాల వ్యవధిలో సమీక్షలు నిర్వహించాలని కలెక్టర్ల సమావేశంలో ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ఆదేశాలిచ్చారన్నారు.

ఆంజనేయుడికి కేజీ వెండి కాయిన్ అందజేత



కేజీ వెండి కాయిన్ అందజేస్తున్న భక్తుడు

గుంటూరు(కార్పొరేషన్), ఆగస్టు 17 : గుంటూరు కొత్తపేటలోని నాజ్ సెంటర్ శ్రీ ఆంజనేయ స్వామి వారికి కేజీ వెండి కాయిన్‌ను భక్తులు శనివారం అందజేశారు. గుంటూరు బ్రాడీపేట వాస్తవ్యులైన జీవీహెచ్ కుమార దత్త అను భక్తుడు శ్రీ ఆంజనేయ స్వామి వారికి కేజీ వెండి కాయిన్ (దిమ్మె)ను దేవస్థానం అసిస్టెంట్ కమిషనర్ డి.శ్రీనివాసరావుకు అందజేశారు. అనంతరం దాతలను ఘనంగా సత్కరించి, స్వామివారి తీర్థప్రసాదాలను అందజేశారు.

నల్లపాడు స్టేషన్ పరిధిలో నాకాబందీ

గుంటూరు, ఆగస్టు 17 : జిల్లా ఎస్పీ సతీష్ కుమార్ ఆదేశాలతో స్థానిక పోలీస్, ఆర్టీఏ అధికారులతో పాటు, నల్లపాడు పోలీస్ స్టేషన్ పరిధిలో 8 ప్రదేశాలలో ఇద్దరు అడిషనల్ ఎస్పీలు, నలుగురు డీఎస్పీలు, 16 మంది సీఐలు, 130 మంది సిబ్బందితో మధ్యాహ్నం 3.30 గంటల నుంచి 5 గంటల వరకు ర్యాష్ డ్రైవింగ్, లైసెన్స్ లేని వాహనాలను, ట్రిపుల్ డ్రైవింగ్, నెంబర్ ప్లేట్లు లేని వాహనాలను తనిఖీలు నిర్వహించి 198 వాహనాలను సీజ్ చేసారు. ఎస్పీ సతీష్ కుమార్ మాట్లాడుతూ ద్విచక్ర వాహనం నడిపే వారు తప్పక హెల్మెట్ ధరించాలన్నారు. మైనర్లు వాహనాలను నడప రాదని, ఆ విధంగా మైనర్లు వాహనాలను నడిపితే తలిదండ్రులదే బాధ్యత అని హెచ్చరించారు.

పోలీస్ అధికారుల సేవలు ప్రశంసనీయం : రేంజ్ ఐజీ



సీసీఎస్ అదనపు ఎస్పీ శ్రీనివాసరావును సన్మానిస్తున్న ఐజీ త్రిపాఠి, ఎస్పీ సతీష్‌కుమార్

గుంటూరు, ఆగస్టు 17 : కొంత కాలంగా జిల్లాలో పని చేసిన పోలీస్ అధికారుల సేవలు ప్రశంసనీయమని రేంజ్ ఐజి త్రిపాఠి, ఎస్పీ సతీష్‌కుమార్ అన్నారు. జిల్లాలో బదిలీపై వెళుతున్న ఈస్ట్ సబ్ డివిజన్ అడిషనల్ ఎస్పీ నచికేత్ సెల్కి, క్రైమ్ అడిషనల్ ఎస్పీ శ్రీనివాసరావు, సౌదీ ఎస్పీ మహబూబ్ బాషా, ట్రాఫిక్ డీఎస్పీ వి.వి. నాయుడు, నార్త్ డీఎస్పీ రవికుమార్, వెస్ట్ డీఎస్పీ మహేష్, ఏడుగురు పోలీసు అధికారులను గుంటూరు పోలీస్ ఆఫీస్ స్పందన కాన్ఫరెన్స్ హాలులో శనివారం ఘనంగా సన్మానించి సత్కరించారు. ఐజి మాట్లాడుతూ బందోబస్తుల్లోను, లా అండ్ ఆర్డర్, ట్రాఫిక్, నాకాబంది, పాల్గొని ముఖ్యంగా ఎలక్షన్లలోను ఎంతో కష్టపడి ఎలక్షన్ సజావుగా జరిగేలా అందించిన మీ కృషి అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్ఈబీ అడిషనల్ ఎస్పీ వెంకటేశ్వరరావు, ఏఆర్ అడిషనల్ ఎస్పీ హనుమంతు, డిఎస్పీలు, సిఐలు ఇతర ముఖ్య అధికారులు పాల్గొన్నారు

యూనియన్ బ్యాంకు ఆధ్వర్యంలో పెన్షనర్లకు సన్మానం

గుంటూరు సిటీ, ఆగస్టు 17 : గుంటూరులోని యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ప్రాంతీయ కార్యాలయంలో పెన్షనర్లకు శనివారం సన్మాన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమానికి యూనియన్ రీజినల్ హెడ్ ఎస్.జవహర్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఆయన మాట్లాడుతూ యూనియన్ బ్యాంక్ ఇప్పుడు సీనియర్ సిటిజన్స్, సూపర్ సీనియర్ సిటిజన్స్‌కు డిపాజిట్లు మీద ఇస్తున్న అధిక వడ్డీ రేట్ల గురించి వివరించారు. 333 డిపాజిట్ స్కీమ్‌లో యూనియన్ బ్యాంక్ సీనియర్ సిటిజన్స్‌కి 7.90%, సూపర్ సీనియర్ సిటిజన్స్‌కి 8.15% వడ్డీ చెల్లిస్తున్నట్లు తెలియజేశారు. అనంతరం పెన్షనర్లను ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో లీడ్ బ్యాంకు మేనేజర్ మహిపాల్‌రెడ్డి, బ్యాంకు అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

ఉరివేసుకుని వృద్ధుడి ఆత్మహత్య

గుంటూరు, ఆగస్టు 17 : నగరంపాలెం పోలీస్‌స్టేషన్ పరిధిలోని దుర్గ నగర్ ఒకటవ లైనులో ఆనాల నాగేశ్వరరావు (63) ఆత్మహత్యకు పాల్పడ్డాడు. గడచిన కొద్ది కాలంలో వారింటిలో పలువురు వరుసగా మృతి చెందారు. అప్పటి నుంచి నాగేశ్వరరావు మనస్థాపానికి గురయ్యాడు. దీనికి తోడు అనారోగ్య సమస్యలు కూడా బాధిస్తున్నాయి. ఈ నేపథ్యంలో శనివారం ఇంటిలో ఎవరూ లేని సమయంలో ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. మృతుడి భార్య పద్మ ఇచ్చిన ఫిర్యాదు మేరకు సంఘటన స్థలానికి చేరుకున్న నగరంపాలెం పోలీసులు మృతదేహాన్ని గుంటూరు ప్రభుత్వ ఆసుపత్రి మార్చురీకి తరలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

కౌన్సిల్.. రచ్చరచ్చ

● తాగునీరు, పారిశుధ్యం నిర్వహణపై ఆగ్రహం

● టీడీఆర్ బాండ్ల కుంభకోణంపై విచారణ చేపట్టాలి



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే నసీర్, మాధవి, రామాంజనేయులు, ఎమ్మెల్సీలు లక్ష్మణరావు, ఏసురత్నం

గుంటూరు(కార్పొరేషన్), ఆగస్టు 17: తాగునీరు, పారిశుధ్యం, బస్ బేలు, గోరంట్ల వాటర్ ట్యాంక్, యూజీడీ, హోర్డింగ్‌లు, గాంధీపార్కు అభివృద్ధిలో అవినీతి తదితర అంశాలపై కౌన్సిల్ సమావేశంలో వాడివేడిగా చర్చలు జరిగాయి. కౌన్సిల్ సమావేశం మేయర్ మనోహర్‌నాయుడు అధ్యక్షతన శనివారం జరిగింది. ఈ సమావేశంలో 50 ప్రశ్నలకు సంబంధించి చర్చ మిగలగా సాయంత్రం 6.30 గంటల సమయం దాటింది. దీంతో కౌన్సిల్ సమావేశాన్ని తిరిగి 20న నిర్వహిస్తున్నట్లు మేయర్ ప్రకటించారు. ఈ సమావేశంలో ఇటీవల జరిగిన ఎన్నికల్లో విజయం సాధించి ఎన్నికైన ఎమ్మెల్యేలు మాధవి, నసీర్ అహ్మద్, రామాంజనేయులు పలు సమస్యలపై గళమెత్తారు. గోరంట్ల కొండపైన వాటర్ ప్రాజెక్టును పూర్తి చేయాలని ఎమ్మెల్యే రామాంజనేయులు, ఎమ్మెల్సీ లక్ష్మణరావు కోరారు. నగరంలో రైల్వే బ్రిడ్జిల నిర్మాణంపై నిర్లక్ష్యం తగదని, టీడీఆర్



టీడీపీ, వైసీపీ కార్పొరేటర్ల మధ్య వాగ్వాదం

బాండ్లలో జరిగిన అవినీతిపై విచారణ జరపాలని ఎమ్మెల్యే రామాంజనేయులు తెలిపారు. తాగునీటి సరఫరాలో నిర్లక్ష్యం వీడాలని ఎమ్మెల్యే బూర్ల రామాంజనేయులు, ఎమ్మెల్సీ లక్ష్మణరావు డిమాండ్ చేశారు. 46 డివిజన్ కార్పొరేటర్ బాలాజీ మాట్లాడుతూ తాగునీరు అందించే విషయంలో కార్పొరేషన్ వల్ల కాకపోతే తిరిగి పంచాయతీకి వెళ్తామన్నారు. తూర్పు ఎమ్మెల్యే నసీర్ అహ్మద్ మాట్లాడుతూ తక్షణమే వాటర్ మేనేజ్‌మెంట్ బాడీని ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. రైల్వే బ్రిడ్జిలపై నగర పాలకసంస్థ ఈస్ట్ మన్ కలర్ సినిమా చూపిస్తుందని ఎమ్మెల్సీ లక్ష్మణ రావు, ఎమ్మెల్యే నసీర్ అహ్మద్, ఎమ్మెల్సీ చంద్రగిరి ఏసురత్నం మండి పడ్డారు. అన్న క్యాంటీన్ మంచి కార్యక్రమం అని ఎమ్మెల్సీ చంద్రగిరి ఏసురత్నం కితాబిచ్చారు. ప్రొటోకాల్ విషయంలో గతంలో నిర్లక్ష్యం జరి గిందని ఏసురత్నం అనగా దీనిపై మేయర్ మండిపడ్డారు. అండర్ గ్రౌండ్ డ్రైనేజీ వ్యవస్థ అధ్వానంగా మారిందని కార్పొరేటర్ పోతురాజు సమత ప్రశ్నతో సమావేశంలో గందరగోళం నెలకొంది. యంత్రాలను ఇం తవరకు ఎందుకు కొనలేదని ఎమ్మెల్యే నసీర్ అహ్మద్ ప్రశ్నించారు. వెహి కల్ షెడ్‌లో 80 వాహనాలు మూలనపడ్డాయన్నారు. కార్పొరేషన్ స్థలాన్ని ప్రైవేటు వ్యక్తులకు ఇవ్వొద్దు డిప్యూటీ మేయర్ డైమండ్ బాబు తెలిపా రు. ఎమ్మెల్యే నసీర్ శిలాఫలకం ధ్వంసంపై కార్పొరేటర్ మల్లవరపు రమ్య ధ్వజమెత్తారు. నగరంలో రోడ్ల ఆక్రమణలు, అక్రమ కట్టడాలపై కఠినంగా చర్యలు తీసుకుంటామని కమిషనర్ పులి శ్రీనివాసులు తెలిపారు. అక్ర మ హోర్డింగ్‌లను అధికారులే ప్రోత్సహిస్తున్నారని పలువురు కార్పొరేటర్లు ఆరోపించారు. విజిలెన్స్ విచారణ జరిపించాలని కార్పొరేటర్లు అచ్చాల వెంకటరెడ్డి, రోషన్ పట్టుపట్టారు.

ఈ - బస్సు బేలకు బ్రేక్..

నగరంలో 20 చోట్ల ఏర్పాటు చేస్తున్న ఈ-బస్సు బేలను నిలిపివేయాలని కౌన్సిల్ తీర్మానించింది. దీనిపై స్పష్టత లేదని సభ్యులు ఆరోపించారు. దీంతో ఎమ్మెల్యే నసీర్ జోక్యం చేసుకుని బస్‌బేలు ప్రజల అవసరం కోసం పెట్టారా? లేక వారి అవసరాల కోసం వీటిని కేటాయించారు చెప్పాలని ప్రశ్నించారు. దీంతో పలువురు కార్పొరేటర్లు కూడా అడ్డం తిరిగారు. దీంతో జీఎంసీ ప్రియాంబుల్ ఆమోదించదని స్పష్టం చేశారు.

చేస్తాము చూస్తామంటే కుదరదు : ఎమ్మెల్యే మాధవి

నియోజకవర్గంలో నీటి సరఫరా, ఇతర సమస్యల గురించి అధికారులను పరిష్కరించమని కోరితే చేస్తాము.. చూస్తాము అని సమాధానం ఇస్తున్నారే తప్ప ఎప్పటి లోగా చేస్తామని చెప్పడం లేదని, ఇలాగైతే కుదరదని పశ్చిమ ఎమ్మెల్యే మాధవి ఆగ్రహం వ్యక్తం చేశారు. కౌన్సిల్ సమావేశంలో ఆమె ఎమ్మెల్యే హోదాలో తొలిసారి హాజరై పలు అంశాలపై మాట్లాడారు. పారిశుధ్య నిర్వహణ అధ్వానంగా ఉందని అసహనం వ్యక్తం చేశారు రాష్ట్రంలో వివిధ కార్పొరేషన్లలో ప్రజా సమస్యలు, అభివృద్ధిపై చర్చలు జరుగుతుంటే ఇక్కడ మాత్రం పారిశుధ్యం గురించి ప్రస్తావన చేయడం బాధాకరంగా ఉందన్నారు. రాజధానిలో అంతర్భాగమైన గుంటూరులో పారిశుధ్య నిర్వహణ దారుణంగా ఉందన్నారు. పలు డివిజన్లలో వీధి దీపాల విషయంలో అధికారులు నిర్లక్ష్యం ప్రదర్శిస్తున్నారన్నారు.

లోపించిన జవాబుదారితనం : ఎమ్మెల్యే నసీర్

అధికారులలో జవాబుదారితనం లేదని, ప్రతి ఒక్క అధికారి బాధ్యతగా వ్యవహరించాలని తూర్పు ఎమ్మెల్యే నసీర్‌అహ్మద్ తెలిపారు. ఎమ్మెల్యే హోదాలో తొలిసారి కౌన్సిల్‌కు హాజరైన ఆయన వివిధ అంశాలపై మాట్లాడారు. సంజీవయ్యనగర్, శివనాగరాజు కాలనీల్లో గత ప్రభుత్వ హయాంలో అక్రమంగా ఏర్పాటు చేసిన శిలాఫలకాలను తొలగించాలని ఆదేశించినా అధికారులు పట్టించుకోలేదని వారిపై చర్యలు తీసుకోవాలన్నారు. విద్యుత్ స్టేషన్లు ఏర్పాటు చేసి కరెంట్ కష్టాలు లేకుండా చేయాలన్నారు. ఔట్ సోర్సింగ్ ఉద్యోగుల జీతాలు, గాంధీపార్క్ అభివృద్ధిలో కుంభకోణం జరిగిందన్నారు. నగరంలో కుక్కల వల్ల ప్రజలు తీవ్రంగా ఇబ్బందులు పడుతున్నారన్నారు.



కొత్తగా ఎన్నికై కార్పొరేషన్‌కు వచ్చిన ఎమ్మెల్యేలను సన్మానిస్తున్న కార్పొరేటర్లు



అన్న క్యాంటీన్లో భోజనం వడ్డిస్తున్న మన్నవ మోహనకృష్ణ

అన్న క్యాంటీన్లతో పేదవాడి ఆకలికి ఫుల్‌స్టాప్ : మన్నవ

గుంటూరు, ఆగస్టు 17(ఆంధ్రజ్యోతి): అన్న క్యాంటీన్లతో రాష్ట్రంలోని పేదవాడి ఆకలికి ఫుల్‌స్టాప్ పడిందని టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి మన్నవ మోహనకృష్ణ అన్నారు. గుంటూరు ఆర్టీవో కార్యాలయం వద్ద ఏర్పాటు చేసిన అన్న క్యాంటీన్‌ను శనివారం ఆయన సందర్శించారు. భోజనం చేయడానికి వచ్చిన వారికి స్వయంగా వడ్డించారు. ఆయన మాట్లాడుతూ గత ప్రభుత్వంలో పేదవాడికి పట్టెడన్నం పెట్టడం కూడా చేతకాక అన్న క్యాంటీన్లు మూసేసి పేదలను ఇబ్బంది పెట్టిందని విమర్శించారు. పేదలకు పట్టెడన్నం పెట్టడమే తన రాజకీయ విధానమని చాటి చెప్పిన ముఖ్యమంత్రి చంద్రబాబు నిర్ణయం అందరికీ ఆదర్శమన్నారు.

అన్న క్యాంటీన్‌ల నిర్వహణకు రూ.11,111 వితరణ

గుంటూరు, ఆగస్టు 17: అన్న క్యాంటీన్‌ల నిర్వహణకు పొగాకు బోర్డు రిటైర్డ్ అధికారి రావెళ్ళ లక్ష్మయ్య రూ.11,111ల చెక్కును పశ్చిమ ఎమ్మెల్యే గళ్ళా మాధవికి అందజేశారు. సమాజమే దేవాలయం-ప్రజలే దేవుళ్ళు అని దివంగత ఎన్టీఆర్ సందేశాన్ని స్ఫూర్తిగా తీసుకొని ఈనెల 16న ప్రారంభించిన అన్న క్యాంటీన్‌ల నిర్వహణకు తన వంతుగా విరాళంగా అందించినట్లు చెప్పారు. ఆకలితో అలమటించే వారికి రూ.5లకే ఆహారం అందించేలా రాష్ట్ర ప్రభుత్వం అన్న క్యాంటీన్‌లను పునఃప్రారంభించటం హర్షణీయమన్నారు.

నేడు లయన్స్ ఇంటర్నేషనల్ జిల్లా కమిటీ ప్రమాణ స్వీకారం

● 150 మంది మహిళలకు కుట్టుమిషన్లు, గ్రైండర్స్ పంపిణీ

గుంటూరు(విద్య), ఆగస్టు 17 : లయన్స్ డిస్ట్రిక్ 316-హెచ్ నూతన కమిటీ ప్రమాణ స్వీకారం ఆదివారం శ్రీ వేంకటేశ్వర విజ్ఞాన మందిరంలో అట్టహాసంగా నిర్వహిస్తునట్లు సంస్థ గవర్నర్ పరుచూరి గోపీంద్ ఒక ప్రకటనలో తెలిపారు. మహిళా స్వయం ఉపాధి కోసం 100 మందికి కుట్టుమిషన్లు, మరో 50 మందికి గ్రైండర్స్, 20 మందికి ఇస్త్రీపెట్టెలు, 50 మందికి తాపీ సామాన్లు అందజేయనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమాలు లయన్స్ క్లబ్ ఆఫ్ గుంటూరు, పట్టాభిపురం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్నట్లు తెలిపారు. నూతన కమిటీ ప్రమాణ స్వీకారం కార్యక్రమానికి కేంద్రసహాయ మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్, చిగురుపాటి వరప్రసాద్ తదితరులు హాజరుకానున్నట్లు చెప్పారు.

మెరుగైన బోధన కోసమే ఉపాధ్యాయులకు శిక్షణ

● సమగ్ర శిక్ష ఏపీవో విజయలక్ష్మి

గుంటూరు(విద్య), ఆగస్టు 17 : ఉపాధ్యాయులు శిక్షణ తరగతుల్ని వినియోగించుకుని విద్యార్థులకు మెరుగైన బోధన చేయాలని సమగ్రశిక్ష ఏపీవో జి.విజయలక్ష్మి సూచించారు. పాతబస్టాండు వద్ద ఉన్న ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాలలో ఉర్దూ పాఠశాలల సముదాయ శిక్షణా కార్యక్రమాలను శనివారం ఆమె పరిశీలించారు. ఏపీవో విజయలక్ష్మి మాట్లాడుతూ కాలానుగుణంగా ఉపాధ్యాయులు నైపుణ్యాలను పెంపొందించుకోవాలని సూచించారు. డిజిటల్ బోధనపై అవగాహన పెంచుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఉర్దూ డీఐ ఎస్‌కేఎండీ ఖాసిం, హెచ్ఎం సిద్దిక్, కార్యదర్శి షాజహాన్, సమగ్రశిక్ష ఏఎస్‌వో జయశంకర్, సీఆర్పీ కీర్తి పాల్గొన్నారు.

వైద్యులకు ప్రత్యేక రక్షణ చట్టం తేవాల్సిందే!

● ఐఎంఏ మహిళా వైద్యుల వింగ్ డిమాండ్

● గుంటూరులో వైద్యుల భారీ ర్యాలీ



శంకర్ విలాస్ సెంటర్‌లో మానవహారంగా ఏర్పడిన వైద్యులు, వైద్య విద్యార్థులు

గుంటూరు (మెడికల్) ఆగస్టు 17: డాక్టర్ల రక్షణ కోసం కేంద్ర ప్రభుత్వం సెంట్రల్ ప్రొటెక్షన్ యాక్ట్‌ను అమలు చేయాల్సిందేనని ఇండియన్ మెడికల్ అసోసియేషన్ (ఐఎంఏ) మహిళా వైద్యుల విభాగం డిమాండ్ చేసింది. అర్ధరాత్రి, అపరాత్రి అని చూడకుండా రోగుల ప్రాణాలు కాపాడేందుకు ఆసుపత్రిలో పని చేసే మహిళా వైద్యుల మాన, ప్రాణాలకు రక్షణ లేకపోతే ఎలా? అని నిలదీసింది. కోల్‌కతాలో జరిగిన ట్రైనీ పీజీ వైద్యురాలి హత్యాచార ఘటనను తీవ్రంగా ఖండిస్తూ ఐఎంఏ రాష్ట్ర శాఖ ఇచ్చిన పిలుపు మేరకు శనివారం గుంటూరులో ప్రైవేటు వైద్యశాలలు బంద్ చేసి నగరంలో భారీ ర్యాలీ నిర్వహించారు. ఐఎంఏ వైద్యులతో పాటు జూనియర్ డాక్టర్లు, దంత వైద్యులు, ఫార్మసీ విద్యార్థులు, నర్సింగ్ విద్యార్థులు ర్యాలీలో పాల్గొన్నారు. లాడ్జి కూడలిలోని అంబేద్కర్ విగ్రహం నుంచి ప్రారంభమైన ర్యాలీ శంకర్ విలాస్, ఓవర్ బ్రిడ్జి మీదుగా ప్రభుత్వ సమగ్రాస్పత్రి వరకు సాగింది. ఐఎంఏ మహిళా వింగ్ అధ్యక్షురాలు డాక్టర్ వీపీఎస్ హరిత మాట్లాడుతూ కోల్‌కతాలో ట్రైనీ పీజీ హత్యాచార ఘటన చూసి సభ్య సమాజం తలదించుకోవాలని ఆగ్రహం వ్యక్తం చేశారు. నిందితులు రాజకీయ అధికార మదంతో తప్పించుకోవాలని చూస్తున్నారని ఆమె ఆరోపించారు.

మహిళా వైద్యుల రక్షణకు ప్రభుత్వం తక్షణం ప్రత్యేక రక్షణ చట్టం తేవాలని డిమాండ్ చేశారు. ఐఎంఏ రాష్ట్ర ప్రెసిడెంట్ ఎలెక్ట్ డాక్టర్ గార్లపాటి నందకిషోర్ మాట్లాడుతూ ప్రజాప్రతినిధులు, పోలీసులు స్పందించి ఈ సంఘటనలో నిందితులను గుర్తించి కఠిన చర్యలు తీసుకోవాలన్నారు. డాక్టర్ పి.విజయ, డాక్టర్ బూసిరెడ్డి నరేంద్రరెడ్డి మాట్లాడుతూ ట్రైనీ పీజీ అత్యాచారంలో బాధిత కుటుంబానికి న్యాయం జరిగేంత వరకు దేశవ్యాప్తంగా వైద్యులు పోరాడతారని తెలిపారు. అనంతరం ర్యాలీ జీజీహెచ్‌కు చేరింది. అక్కడ నిరసన శిబిరంలో జూనియర్ డాక్టర్లకు ఐఎంఏ వైద్యులు మద్దతు పలికారు. కాగా నిత్యం రద్దీగా కనిపించే కొత్తపేట ఓల్డ్‌క్లబ్ రోడ్‌లో శనివారం ఆసుపత్రులు మూతబడటంతో రోడ్లు బోసిపోయి కనిపించాయి. ప్రభుత్వాస్పత్రిలో కూడా శనివారం ఓపీ తగ్గింది. రోగులకు వైద్యసేవల్లో ఇబ్బందులు తలెత్తకుండా నివారించేందుకు వైద్య ఆరోగ్య శాఖ నుంచి 10 మంది, వైద్య కళాశాల నుంచి నాన్‌క్లినికల్ విభాగాలకు చెందిన 40 మంది డాక్టర్లను డిప్యుటేషన్‌పై జీజీహెచ్‌లో నియమించారు.

జూడాలకు మద్దతుగా ప్రభుత్వ వైద్యుల ధర్నా



ధర్నాలో పాల్గొన్న ప్రభుత్వ వైద్యులు

కోల్‌కతాలోని ట్రైనీ పీజీ వైద్యురాలి హత్యాచారాన్ని నిరసిస్తూ వారం రోజులుగా గుంటూరు ప్రభుత్వ సమగ్రాస్పత్రిలో విధులు బహిష్కరించి ఆందోళన నిర్వహిస్తున్న జూనియర్ డాక్టర్లకు మద్దతుగా శనివారం ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ వైద్యుల సంఘం (ఏపీజీడీఏ) గుంటూరు యూనిట్ సభ్యులు ధర్నా చేశారు. ప్రభుత్వ వైద్యుల సంఘం గుంటూరు యూనిట్ ప్రెసిడెంట్ డాక్టర్ రమణ యశస్వి మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం వెంటనే సెంట్రల్ ప్రొటెక్షన్ యాక్ట్ అమలు చేయాలని డిమాండ్ చేశారు. వైద్యులు పని చేసే ప్రాంతాల్లో పోలీసు రక్షణతో పాటు సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలని కోరారు. కార్యక్రమంలో సంఘం కార్యదర్శి సుబ్బారావు, కోశాధికారి నాగేశ్వరరావు, కేంద్ర సెక్రటరీ డాక్టర్ రమేష్, తదితర వైద్యులు పాల్గొన్నారు.



నిరసన ప్రదర్శనలో డాక్టర్ రాజకుమారి తదితరులు

మహిళా వైద్యులపై దాడులు అరికట్టాలి

గుంటూరు (మెడికల్) ఆగస్టు 17: కోల్‌కతాలోని ట్రైనీ పీజీ వైద్యురాలి హత్యాచారానికి నిరసనగా టీడీపీ నాయకురాలు డాక్టర్ శనక్కాయల రాజకుమారి, భారతీయ జనతా పార్టీ మహిళా మోర్చా ఆధ్వర్యంలో శనివారం సాయంత్రం నగరంలో కొవ్వొత్తులతో ర్యాలీ నిర్వహించారు. ర్యాలీలో పలువురు మహిళలు నోటికి నల్ల రిబ్బన్ ధరించి, వెలుగుతున్న కొవ్వొత్తులు చేతబూని ఈ ఘటనపై తమ మౌన నిరసన వ్యక్తం చేశారు. డాక్టర్ రాజకుమారి మాట్లాడుతూ ట్రైనీ పీజీ హంతకులను కఠినంగా శిక్షించాలని పశ్చిమ బెంగాల్ ప్రభుత్వానికి, ప్రధాని నరేంద్ర మోదీకి విజ్ఞప్తి చేస్తున్నట్లు ఆమె తెలిపారు. కార్యక్రమంలో బీజేపీ మహి ళా మోర్చా అధ్యక్షురాలు మల్లేశ్వరి, బీజేపీ జిల్లా అధ్యక్షుడు వనమా నరేంద్రకుమా ర్, ఆరో మండల అధ్యక్షుడు సురేష్‌కుమార్ జైన్, కుమార్‌గౌడ్, పద్మనాభం పాల్గొన్నారు.

రజక జన సేవా సంఘం ఆధ్వర్యంలో...

గుంటూరు, ఆగస్టు 17: కలకత్తాలో పీజీ వైద్య విద్యార్థినిపై జరిగిన సంఘటనకు నిరసనగా గుంటూరు టౌన్ రజక జనసేవా సంఘం ఆధ్వర్యంలో కొవ్వొత్తుల నిరసన కార్యక్రమం బ్రహ్మానందరెడ్డి స్టేడియం ఎదురుగా దోబీ ఖానాల వద్ద శనివారం సాయంత్రం జరిగింది. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర రజక జన సేవా సంఘం ప్రధాన కార్యదర్శి జూపూడి శ్రీనివాసరావు మాట్లాడుతూ దేశంలో మహిళలపై జరుగుతోన్న దాడులపై కేంద్ర ప్రభుత్వం మరింత కఠినంగా వ్యవహరించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఈమని ఉమామహేశ్వరరావు, జాతీయ బహుజన మహాసభ సెంట్రల్ కమిటీ కార్యదర్శి జీఆర్ భగత్‌సింగ్, ముస్లిం హక్కుల పోరాట సమితి అధ్యక్షుడు ఖాజావలి, అస్లాం, సలీమా, నిడుముక్కల రాంబాబు, చోడవరపు వెంకటేశ్వర్లు, వట్టికూటి సాంబయ్య, ఎస్.శ్రీనివాసరావు, వలివేటి శ్రీనివాసరావు, గుంటూరు నరసింహారావు, వీరవల్లి శ్రీనివాసరావు, షేక్ సైదా ఆవాజ్, కృష్ణ, సీహెచ్ వెంకటేశ్వరరావు తదితరులున్నారు.

తెనాలి సబ్ కలెక్టర్ ప్రకార్ జైన్ బదిలీ

గుంటూరు, ఆగస్టు 17 (ఆంధ్రజ్యోతి): తెనాలి సబ్ కలెక్టర్ ప్రకార్ జైన్ బదిలీ అయ్యారు. 2021 సివిల్స్ బ్యాచ్‌కు చెందిన ఆయన గత ఏడాది ఆఖరులో తెనాలి సబ్ కలెక్టర్‌గా బదిలీపై వచ్చారు. తెనాలి అసెంబ్లీ నియోజకవర్గం రిటర్నింగ్ అధికారిగా ఆయన సమర్థవంతంగా బాధ్యతలు నిర్వహించారు. అయితే శనివారం రాత్రి ప్రకార్ జైన్‌ని పాడేరు సబ్ కలెక్టర్‌గా నియమిస్తూ రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి నీరబ్ కుమార్ ప్రసాద్ ఉత్తర్వులు జారీ చేశారు. పాడేరు ఐటీడీఏ పీవో బాధ్య తలు కూడా ఆయనకు అదనంగా కేటాయించారు. బదిలీ అయిన జైన్ స్థానంలో కొత్తగా ఎవరిని నియమించలేదు.

పాస్‌పోర్ట్ పోయినది

శానంపూడి కోటిరెడ్డి, S/O శానంపూడి పెద పాపిరెడ్డి, వయస్సు 38, #20-2-131 లేన్-2, గౌతమి నగర్, గుంటూరు, గుంటూరు జిల్లా-522004, ఆంధ్రప్రదేశ్, భారతదేశం నందు నివసిస్తున్న నేను, నా ఒరిజినల్ పాస్‌పోర్ట్‌ని 05.08.2024న గుంటూరు నగరంపాలెం నుండి డిస్ట్రిక్ట్ కోర్టుకి వెళ్ళుచుండగా ఆటోలో ప్రయాణిస్తున్నప్పుడు పోగొట్టుకున్నాను. 04.07.2013న హైదరాబాద్‌లో జారి చేయబడిన నం. L2855989 గల పాస్‌పోర్ట్ 03.07.2023 వరకు చెల్లుబాటు అవుతుంది. దొరికితే దయచేసి క్రింద నెంబరుకు సంప్రదించండి.
+91 81065 93761

నోటీసు

IN THE COURT OF THE I ADDL. CIVIL JUDGE(SENIOR DIVISION)::GUNTUR
E.P.No.13/2024 in O.S.No.110/2021

Between:
Damarla Naga Lakshmi ... DHR
And
Marri Nagaraja Kumar rep. by his GPA agent M/s.Satya Constructions Pvt. Ltd.Rep. by it's authorized person and Managing Director Maddirala Sambasiva Rao & Others. ...JDR's

To,
JDR No-1:Marri Nagaraja Kumar, S/o. Koteswara Rao, rep. by his GPA agent, M/s. Satya Constructions Pvt. Ltd. Rep. by it's authorized person and Managing Director Maddirala Sambasiva Rao.
JDR No-2:M/s. Satya Constructions Pvt. Ltd. Rep. by it's authorized person and Managing Director Maddirala Sambasiva Rao.
JDR No-3: Maddirala Sambasiva Rao S/o. late Ankamma,All are R/o. Flat No.403, Satya Yamini Apartments, 3/12 Brodipet, Guntur City-522002
JDR No-4: Popuri Satyanarayana S/o. Late Subbaiah, Hindu aged about 56 years, Business, Resident of Flat No.405, Satya Nivas, 2/12 Brodipet, Guntur City-522002.

పై నంబరు ఇ.పి.ని డి.హెచ్.ఆర్. తగుపరిహారములు కోరుచూ జె.డి.ఆర్స్ అయిన మీపై దాఖలు చేసి పలుపర్యాయములు కోర్టు నోటీసులు పంపించినను మీరు బుద్ధిపూర్వకంగా తీసుకొనక కాలయాపన చేస్తున్నందు వలన శ్రీ కోర్టువారు మీ హాజరు నిమిత్తమై ఈ పేపరు ప్రకటన ద్వారా ఉత్తర్వులు జారీ చేసియున్నారు. కనుక 1నుండి4 జె.డి.ఆర్స్ అయిన మీరు ది.18-09-2024న ఉ.గం.10-30 ని.లకు పై చెప్పిన కోర్టు వారి ఎదుట హాజరై సదరు ఇ.పి. లో మీకు గల ఆక్షేపణలను తెలుపగలరు. లేని ఎడల సదరు ఇ.పి.ని మీ పరోక్షమందు తీర్మానము చేయబడునని తెలియజేయటమైనది.

వాయి దా తేది: 18-09-2024

గోవిందరాజు శాయికృష్ణ శ్రీనివాస్, డి.హెచ్.ఆర్. తరపు న్యాయవాది, గుంటూరు.

నోటీసు

IN THE COURT OF THE I ADDL. CIVIL JUDGE(SENIOR DIVISION)::GUNTUR
E.P.No.12/2024 in O.S.No.109/2021

Between:
Gunti Harika ...DHR
And
Marri Nagaraja Kumar rep. by his GPA agent M/s.Satya Constructions Pvt. Ltd.Rep. by it's authorized person and Managing Director Maddirala Sambasiva Rao & Others. ...JDR's

To,
JDR No-1:Marri Nagaraja Kumar, S/o. Koteswara Rao, rep. by his GPA agent, M/s. Satya Constructions Pvt. Ltd. Rep. by it's authorized person and Managing Director Maddirala Sambasiva Rao.
JDR No-2:M/s. Satya Constructions Pvt. Ltd. Rep. by it's authorized person and Managing Director Maddirala Sambasiva Rao.
JDR No-3: Maddirala Sambasiva Rao S/o. late Ankamma,All are R/o. Flat No.403, Satya Yamini Apartments, 3/12 Brodipet, Guntur City-522002
JDR No-4: Popuri Satyanarayana S/o. Late Subbaiah, Hindu aged about 56 years, Business, Resident of Flat No.405, Satya Nivas, 2/12 Brodipet, Guntur City-522002.

పై నంబరు ఇ.పి.ని డి.హెచ్.ఆర్. తగుపరిహారములు కోరుచూ జె.డి.ఆర్స్ అయిన మీపై దాఖలు చేసి పలుపర్యాయములు కోర్టు నోటీసులు పంపించినను మీరు బుద్ధిపూర్వకంగా తీసుకొనక కాలయాపన చేస్తున్నందు వలన శ్రీ కోర్టువారు మీ హాజరు నిమిత్తమై ఈ పేపరు ప్రకటన ద్వారా ఉత్తర్వులు జారీ చేసియున్నారు. కనుక 1నుండి4 జె.డి.ఆర్స్ అయిన మీరు ది.18-09-2024న ఉ.గం.10-30 ని.లకు పై చెప్పిన కోర్టు వారి ఎదుట హాజరై సదరు ఇ.పి. లో మీకు గల ఆక్షేపణలను తెలుపగలరు. లేని ఎడల సదరు ఇ.పి.ని మీ పరోక్షమందు తీర్మానము చేయబడునని తెలియజేయటమైనది.

వాయి దా తేది: 18-09-2024

గోవిందరాజు శాయికృష్ణ శ్రీనివాస్, డి.హెచ్.ఆర్. తరపు న్యాయవాది, గుంటూరు.

నోటీసు

IN THE COURT OF THE I ADDL. CIVIL JUDGE(SENIOR DIVISION)::GUNTUR
E.P.No.11/2024 in O.S.No.108/2021

Between:
Bodduluri Siva Kumari & Another ... DHR's
And
Marri Nagaraja Kumar rep. by his GPA agent M/s.Satya Constructions Pvt. Ltd.Rep. by it's authorized person and Managing Director Maddirala Sambasiva Rao & Others. ...JDR's

To,
JDR No-1:Marri Nagaraja Kumar, S/o. Koteswara Rao, rep. by his GPA agent, M/s. Satya Constructions Pvt. Ltd. Rep. by it's authorized person and Managing Director Maddirala Sambasiva Rao.
JDR No-2:M/s. Satya Constructions Pvt. Ltd. Rep. by it's authorized person and Managing Director Maddirala Sambasiva Rao.
JDR No-3: Maddirala Sambasiva Rao S/o. late Ankamma,All are R/o. Flat No.403, Satya Yamini Apartments, 3/12 Brodipet, Guntur City-522002
JDR No-4: Popuri Satyanarayana S/o. Late Subbaiah, Hindu aged about 56 years, Business, Resident of Flat No.405, Satya Nivas, 2/12 Brodipet, Guntur City-522002.

పై నంబరు ఇ.పి.ని డి.హెచ్.ఆర్. తగుపరిహారములు కోరుచూ జె.డి.ఆర్స్ అయిన మీపై దాఖలు చేసి పలుపర్యాయములు కోర్టు నోటీసులు పంపించినను మీరు బుద్ధిపూర్వకంగా తీసుకొనక కాలయాపన చేస్తున్నందు వలన శ్రీ కోర్టువారు మీ హాజరు నిమిత్తమై ఈ పేపరు ప్రకటన ద్వారా ఉత్తర్వులు జారీ చేసియున్నారు. కనుక 1నుండి4 జె.డి.ఆర్స్ అయిన మీరు ది.18-09-2024న ఉ.గం.10-30 ని.లకు పై చెప్పిన కోర్టు వారి ఎదుట హాజరై సదరు ఇ.పి. లో మీకు గల ఆక్షేపణలను తెలుపగలరు. లేని ఎడల సదరు ఇ.పి.ని మీ పరోక్షమందు తీర్మానము చేయబడునని తెలియజేయటమైనది.

వాయి దా తేది: 18-09-2024

గోవిందరాజు శాయికృష్ణ శ్రీనివాస్, డి.హెచ్.ఆర్. తరపు న్యాయవాది, గుంటూరు.

నోటీసు

IN THE COURT OF THE I ADDL. CIVIL JUDGE(SENIOR DIVISION)::GUNTUR
E.P. No: 49 / 2023 in O.S. No: 115 / 2021

Between:
Bandreddy Srinivasa Rao .....DHR
And
Marri Nagaraja Kumar rep. by his GPA agent M/s.Satya Constructions Pvt. Ltd.Rep. by it's authorized person and Managing Director Maddirala Sambasiva Rao & Others. ...JDR's

To,
JDR No-1:Marri Nagaraja Kumar, S/o. Koteswara Rao, rep. by his GPA agent, M/s. Satya Constructions Pvt. Ltd. Rep. by it's authorized person and Managing Director Maddirala Sambasiva Rao.
JDR No-2:M/s. Satya Constructions Pvt. Ltd. Rep. by it's authorized person and Managing Director Maddirala Sambasiva Rao.
JDR No-3: Maddirala Sambasiva Rao S/o. late Ankamma,All are R/o. Flat No.403, Satya Yamini Apartments, 3/12 Brodipet, Guntur City-522002
JDR No-4: Popuri Satyanarayana S/o. Late Subbaiah, Hindu aged about 56 years, Business, Resident of Flat No.405, Satya Nivas, 2/12 Brodipet, Guntur City-522002.


పై నంబరు ఇ.పి.ని డి.హెచ్.ఆర్. తగుపరిహారములు కోరుచూ జె.డి.ఆర్స్ అయిన మీపై దాఖలు చేసి పలుపర్యాయములు కోర్టు నోటీసులు పంపించినను మీరు బుద్ధిపూర్వకంగా తీసుకొనక కాలయాపన చేస్తున్నందు వలన శ్రీ కోర్టువారు మీ హాజరు నిమిత్తమై ఈ పేపరు ప్రకటన ద్వారా ఉత్తర్వులు జారీ చేసియున్నారు. కనుక 1నుండి4 జె.డి.ఆర్స్ అయిన మీరు ది.05-09-2024న ఉ.గం.10-30 ని.లకు పై చెప్పిన కోర్టు వారి ఎదుట హాజరై సదరు ఇ.పి. లో మీకు గల ఆక్షేపణలను తెలుపగలరు. లేని ఎడల సదరు ఇ.పి.ని మీ పరోక్షమందు తీర్మానము చేయబడునని తెలియజేయటమైనది.

వాయి దా తేది: 05-09-2024

గోవిందరాజు శాయికృష్ణ శ్రీనివాస్, డి.హెచ్.ఆర్. తరపు న్యాయవాది, గుంటూరు.

దిక్సూచి DIKSUCHI

నేషనల్ లా స్కూల్లో లీగల్ ప్రోగ్రామ్‌లు



బెంగళూరులోని నేషనల్ లా స్కూల్ ఆఫ్ ఇండియా యూనివర్సిటీ(ఎన్ఎల్ఎస్ఐయూ)- మాస్టర్ ఆఫ్ బిజినెస్ లాస్(ఎంబీఎల్), పీజీ డిప్లొమా ప్రోగ్రామ్‌లలో ప్రవేశానికి దరఖాస్తులు కోరుతోంది. వీటిని ప్రొఫెషనల్ అండ్ కంటిన్యూయింగ్ ఎడ్యుకేషన్(పీపీసీఈ) కింద బ్లెండెడ్ లెర్నింగ్ ఫార్మాట్‌లో నిర్వహిస్తారు. ఆన్‌లైన్ సెషన్స్, హైబ్రిడ్ ప్రోగ్రామ్స్ ఉంటాయి.

మాస్టర్ ఆఫ్ బిజినెస్ లాస్(ఎంబీఎల్): ప్రోగ్రామ్ వ్యవధి రెండేళ్లు. ఇందులో పది కోర్సులు ఉంటాయి. మొదటి ఏడాది కాంట్రాక్ట్ లా, బ్యాంకింగ్ లా, కార్పొరేట్ లా, ఇండస్ట్రియల్ రిలేషన్స్ లా, ఎన్విరాన్‌మెంటల్ లా కోర్సులు; రెండో ఏడాది ఇన్వెస్ట్‌మెంట్ లాస్, ఇన్సూరెన్స్ లాస్, ఇంటర్నేషనల్ కమర్షియల్ ట్రాన్సాక్షన్స్ అండ్ ఫారిన్ ట్రేడ్, ఇంటెలెక్చువల్ ప్రాపర్టీ లాస్, టాక్సెస్ ఆన్ కార్పొరేషన్స్ కోర్సులు ఉంటాయి. ఈ ప్రోగ్రామ్ పూర్తిచేసిన అభ్యర్థులు లా ఆఫీసర్, లీగల్ అసిస్టెంట్, లీగల్ అడ్వైజర్‌గా రాణించవచ్చు.

పీజీ డిప్లొమా: ప్రోగ్రామ్ వ్యవధి ఏడాది. ఇందులో ఆర్బిట్రేషన్ లా, చైల్డ్ రైట్స్ లా, కన్జూమర్ లా అండ్ ప్రాక్టీస్, సైబర్ లా అండ్ సైబర్ ఫోరెన్సిక్స్, ఎన్విరాన్‌మెంటల్ లా, హ్యూమన్ రైట్స్ లా, ఇంటెలెక్చువల్ ప్రాపర్టీ రైట్స్ లా, మెడికల్ లా అండ్ ఎథిక్స్, టాక్సేషన్ లా స్పెషలైజేషన్‌లు అందుబాటులో ఉన్నాయి. స్పెషలైజేషన్‌ను అనుసరించి ఈ ప్రోగ్రామ్ జర్నలిస్టులు, అడ్వకేట్‌లు, రైట్స్ యాక్టివిస్టులు, డాక్టర్‌లు, నర్స్‌లు, హాస్పిటల్ అడ్మినిస్ట్రేటర్‌లు, హెల్త్ వర్కర్‌లు, ఎన్విరాన్‌మెంటల్ ప్రొఫెషనల్స్, ఎన్జీఓలు, లీగల్-ఎడ్యుకేషనల్-రీసెర్చ్ విభాగాలకు చెందిన ప్రొఫెషనల్స్‌కు ఉపయుక్తంగా ఉంటుంది. పూర్తి సమాచారం కోసం వెబ్‌సైట్ చూడవచ్చు.

అర్హత: గుర్తింపు పొందిన యూనివర్సిటీ నుంచి ఏదేని డిగ్రీ ఉత్తీర్ణులు దరఖాస్తు చేసుకోవచ్చు. సీఏ, సీఎస్, ఐసీడబ్ల్యూఏఐ కోర్సులు పూర్తిచేసినవారు; ఓపెన్ యూనివర్సిటీలలో చదివినవారు; డిస్టెన్స్ ఎడ్యుకేషన్ ద్వారా డిగ్రీలు పొందిన వారు కూడా అప్లయ్ చేసుకోవచ్చు. వయోపరిమితి నిబంధనలు లేవు.

- **ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ:** సెప్టెంబరు 10
- **వెబ్‌సైట్:** https://pace.nls.ac.in/

డా.ఎన్‌టీఆర్‌యూహెచ్‌ఎస్ అనుబంధ కళాశాలల్లో

మేనేజ్‌మెంట్ కోటా

విజయవాడలోని డా.ఎన్‌టీఆర్ యూనివర్సిటీ ఆఫ్ హెల్త్ సైన్సెస్(డా.ఎన్‌టీఆర్‌యూహెచ్‌ఎస్)- మెడికల్, డెంటల్ డిగ్రీ ప్రోగ్రామ్‌లలో మేనేజ్‌మెంట్, ఎన్ఆర్ఐ కోటా సీట్ల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది. వర్సిటీకి అనుబంధంగా ఉన్న ప్రైవేట్ అన్ ఎయిడెడ్ నాన్ మైనారిటీ, మైనారిటీ మెడికల్&డెంటల్ కళాశాలల్లో బీ కేటగిరీ, సీ కేటగిరీ(ఎన్ఆర్ఐ) సీట్లు; తిరుపతి స్విమ్స్ ఆధ్వర్యంలోని శ్రీ పద్మావతీ మెడికల్ కాలేజ్ ఫర్ ఉమెన్‌లోని ఎన్ఆర్ఐ సీట్లు; నూతనంగా అనుమతించిన ప్రభుత్వ మెడికల్ కళాశాలల్లోని కాంపిటెంట్ అథారిటీ కోటా(సెల్ఫ్ ఫైనాన్సింగ్/ఎన్ఆర్ఐ) సీట్లు భర్తీ చేయనున్నారు. ప్రభుత్వ/ప్రైవేట్ కళాశాలలు, సీట్ల వివరాల కోసం సంస్థ వెబ్‌సైట్‌లో చూడవచ్చు. వెబ్ కౌన్సెలింగ్ ద్వారా అడ్మిషన్స్ ఇస్తారు.

అర్హత: అభ్యర్థులు గుర్తింపు పొందిన బోర్డు నుంచి కనీసం 50 శాతం మార్కులతో ఫిజిక్స్, కెమిస్ట్రీ, బయాలజీ(బోటనీ, జువాలజీ)/బయోటెక్నాలజీ ఉత్తీర్ణులై ఉండాలి. ఓబీసీ, బీసీ, ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు 40 శాతం మార్కులు చాలు. నీట్ యూజీ 2024 అర్హత పొంది ఉండాలి. ఇందులో జనరల్/ఈడబ్ల్యూఎస్ అభ్యర్థులకు 720-162; బీసీ, ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు 161-127; జనరల్/ఈడబ్ల్యూఎస్ దివ్యాంగులకు 161-144 స్కోర్‌ను కటాఫ్‌గా నిర్దేశించారు. విద్యార్థుల వయసు 2024 డిసెంబరు 31 నాటికి 17 ఏళ్లు నిండి ఉండాలి.

- ఎన్ఆర్ఐలు, ఎన్ఆర్ఐల రక్త సంబంధీకులు మాత్రమే ఎన్ఆర్ఐ కోటా సీట్లకు అప్లయ్ చేసు కోవాలి. నూతన మెడికల్ కళాశాలల్లోని సెల్ఫ్ ఫైనాన్సింగ్ సీట్లకు స్థానికులు మాత్రమే దరఖాస్తు చేసుకోవాలి.

- **ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ:** ఆగస్టు 21
- **వెబ్‌సైట్:** https://drntr.uhsap.in

డా.వైఎస్సార్ఏఎఫ్‌యూలో బీఆర్క్



కడపలోని డా.వైఎస్సార్ ఆర్కిటెక్చర్ అండ్ ఫైన్ ఆర్ట్స్ యూనివర్సిటీ(డా.వైఎస్సార్ఏఎఫ్‌యూ)- బీఆర్క్ డిగ్రీలో ప్రవేశానికి దరఖాస్తులు కోరుతోంది. రాష్ట్రవ్యాప్తంగా ఉన్న ప్రభుత్వ, ప్రైవేట్, నాన్ మైనారిటీ, మైనారిటీ కళాశాలల్లో నాటా 2024 స్కోర్ ఆధారంగా లోకల్, నాన్ లోకల్ కేటగిరీల్లో అడ్మిషన్స్ ఇస్తారు. ప్రోగ్రామ్ వ్యవధి అయిదేళ్లు.

కళాశాలలు-సీట్లు

- ఆంధ్ర యూనివర్సిటీ కాలేజ్ ఆఫ్ ఇంజనీరింగ్, విశాఖపట్నం-44 కన్వీనర్ కోటా సీట్లు
- డా.వైఎస్సార్ ఆర్కిటెక్చర్ అండ్ ఫైన్ ఆర్ట్స్ యూనివర్సిటీ, కడప-44 కన్వీనర్ కోటా సీట్లు
- ఏఎస్‌యూ కాలేజ్ ఆఫ్ ఆర్కిటెక్చర్ అండ్ ప్లానింగ్, గుంటూరు-44 కన్వీనర్ కోటా సీట్లు
- ఎంఆర్‌కే కాలేజ్ ఆఫ్ ఆర్కిటెక్చర్, భీమవరం- 15 కన్వీనర్ కోటా సీట్లు, 6 మేనేజ్‌మెంట్ కోటా సీట్లు
- చదలవాడ అరుణ స్కూల్ ఆఫ్ ఆర్కిటెక్చర్, తిరుపతి-28 కన్వీనర్ కోటా సీట్లు, 12 మేనేజ్‌మెంట్ కోటా సీట్లు

అర్హత: గుర్తింపు పొందిన బోర్డు నుంచి మేథమెటిక్స్, ఫిజిక్స్, కెమిస్ట్రీ/బయాలజీ/టెక్నికల్ ఒకేషనల్ సబ్జెక్ట్/కంప్యూటర్ సైన్స్/ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ/ఇన్ఫర్మాటిక్స్ ప్రాక్టీసెస్/ఇంజనీరింగ్ గ్రాఫిక్స్/బిజినెస్ స్టడీస్ ప్రధాన సబ్జెక్టులుగా ఇంటర్/పన్నెండోతరగతి ఉత్తీర్ణులు దరఖాస్తు చేసుకోవచ్చు. మేథమెటిక్స్ ఒక సబ్జెక్ట్‌గా మూడేళ్ల ఇంజనీరింగ్ డిప్లొమా పూర్తిచేసినవారు కూడా అప్లయ్ చేసుకోవచ్చు. ఏ కోర్సులోనైనా కనీసం 45 శాతం మార్కులు ఉండాలి. నాటా 2024 అర్హత తప్పనిసరి.

- **ఫీజు:** జనరల్ అభ్యర్థులకు రూ.1500; బీసీ అభ్యర్థులకు రూ.1300; ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు రూ.1,000
- **దరఖాస్తుకు చివరి తేదీ:** ఆగస్టు 19
- **సర్టిఫికెట్ల వెరిఫికేషన్‌కు చివరి తేదీ:** ఆగస్టు 20
- **ఈ మెయిల్ ద్వారా కరెక్షన్స్:** ఆగస్టు 21 నుంచి 22 వరకు
- **వెబ్ ఆప్షన్స్:** ఆగస్టు 26 నుంచి 27 వరకు
- **ఎంపికైన అభ్యర్థుల జాబితా విడుదల:** ఆగస్టు 29
- **ఎంపికైన అభ్యర్థుల రిపోర్టింగ్:** ఆగస్టు 30 నుంచి సెప్టెంబరు 2 వరకు
- **మిగిలిన సీట్ల వివరాలు వెల్లడి:** సెప్టెంబరు 2
- **వెబ్‌సైట్:** www.ysrafu.ac.in, https://apsche.ap.gov.in/arch/

'దిక్సూచి' వెబ్ పేజీలో..
సమాచారం కోసం ఈ క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి. లేదా ఈ కింది యూఆర్ఎల్ https://ejyothy.com/sS6GAamలో చదవండి.

నవ్య | చిత్రజ్యోతి



పవన్ కల్యాణ్ కథానాయకుడిగా నటిస్తున్న పీరియాడిక్ యాక్షన్ డ్రామా 'హరిహర వీరమల్లు'. నిధి అగర్వాల్ కథానాయిక. శనివారం ఆమె పుట్టిన రోజు సందర్భంగా చిత్రబృందం ప్రత్యేక పోస్టర్‌ను విడుదల చేసింది.



హిస్టారికల్ బ్యాక్‌డ్రాప్‌లో వారియర్ స్టోరీ

ప్రభాస్ కొత్త చిత్రం శనివారం ఉదయం మొదలైంది. హను రాఘవపూడి దర్శకత్వంలో మైత్రీ మూవీ మేకర్స్ సంస్థ అధినేతలు నవీన్ యర్నేని, రవిశంకర్ వై నిర్మిస్తున్నారు. ఇన్‌స్టాలో తన వీడియాలతో అందరినీ ఆకట్టుకొన్న ఇమాన్వీ ఎస్మాయిల్ ఈ సినిమాలో హీరోయిన్‌గా నటిస్తున్నారు. ఈ సినిమా కాన్సెప్ట్ పోస్టర్‌ను చిత్ర బృందం విడుదల చేసింది. ఇందులో 'పరిత్రాణాయ సాధూనాం' అంటూ భగవద్గీత శ్లోకాన్ని ప్రచురించారు. 'ఆపరేషన్ జెడ్' అని మరొక చోట పేర్కొన్నారు. అలాగే ఈ సినిమా క్లాప్ బోర్డ్ మీద కోల్‌కతా హౌరా బ్రిడ్జ్, సుభాష్ చంద్రబోస్ 'ఆజాద్ హింద్ ఫౌజ్' పతాకం, చార్మినార్.. ఉండడం ఆసక్తిరేకెత్తిస్తోంది. 1940 బ్యాక్‌డ్రాప్‌లో జరిగే ఈ చిత్రకథలో ప్రభాస్ వారియర్‌గా ఓ పవర్‌ఫుల్ పాత్ర పోషిస్తున్నారు. మిథున్ చక్రవర్తి, జయప్రద కీలక పాత్రలు చేస్తున్నారు. భారీ బడ్జెట్‌తో ప్రతిష్ఠాత్మకంగా రూపుదిద్దుకుంటున్న ఈ చిత్రానికి సంగీతం: విశాల్ చంద్రశేఖర్, ఫొటోగ్రఫీ: సుదీప్ ఛటర్జీ, ఎడిటింగ్: కోటగిరి వెంకటేశ్వరరావు.

మెల్‌బోర్న్‌లో మువ్వన్నెల రెపరెపలు



మెల్‌బోర్న్‌లో జరుగుతున్న ఇండియన్ ఫిల్మ్ ఫెస్టివల్ ఆఫ్ మెల్‌బోర్న్‌కు రామ్‌చరణ్ గౌరవ అతిథిగా హాజరైన విషయం తెలిసిందే. సినీ పరిశ్రమకు ఆయన అందించిన సేవలకు గుర్తింపుగా ఆర్ట్ అండ్ కల్చర్ బ్రాండ్ అంబాసిడర్ పురస్కారాన్ని శనివారం అందుకున్నారు. ఏటా ఈ పురస్కారం అందుకున్న వ్యక్తులు భారత జాతీయ పతాకాన్ని ఎగురవేయడం ఆనవాయితీగా వస్తోంది. ఈ నేపథ్యంలో శనివారం ఫెడరేషన్ స్క్వేర్‌లో ఘనంగా జరిగిన వేడుకల్లో రామ్‌చరణ్ త్రివర్ణ పతాకాన్ని ఎగురవేశారు.

ఐఎఫ్ఎఫ్ఎం పురస్కారాల ప్రధానం

ఐఎఫ్ఎఫ్ఎం చిత్రోత్సవాల్లో విజేతలకు పురస్కారాలను ప్రధానం చేశారు. చందు ఛాంపియన్ చిత్రానికి గాను కార్తిక్ ఆర్యన్ ఉత్తమ నటుడి పురస్కారం స్వీకరించారు. ఉత్తమ దర్శకుడి పురస్కారాన్ని కబీర్‌ఖాన్, నిథిలన్ స్వామినాథన్ (మహారాజా)తో కలసి అందుకున్నారు. ఉత్తమ నటిగా పార్వతి తిరువోతు, ఉత్తమ చిత్రంగా 'ట్వల్త్ ఫెయిల్' పురస్కారాలను దక్కించుకున్నాయి. క్రిటిక్స్ విభాగంలో ఉత్తమ నటుడి పురస్కారం విక్రాంత్‌మాసేకు దక్కింది. సంగీత దర్శకుడు ఏ. ఆర్ రెహమాన్ విశిష్ట పురస్కారం స్వీకరించారు.

ప్రేక్షకులు దూరమైంది అందుకే

- దిల్‌రాజు



'ప్రేక్షకుల్ని చెడగొట్టింది మేమే.'మీరు ఇంట్లోనే కూర్చోండి.. నాలుగు వారాల్లో సినిమాను ఓటీటీలో చూపిస్తాం' అని వారిని థియేటర్‌కు రాకుండా చేసుకున్నాం' అని నిర్మాత దిల్‌రాజు కీలక వ్యాఖ్యలు చేశారు. 'రేవు' చిత్రం ఈ నెల 23న విడుదల కానుంది. ఈ నేపథ్యంలో శుక్రవారం జరిగిన ట్రైలర్ లాంచ్ ఈవెంట్‌లో దిల్ రాజు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 'సినిమా తీయడం గొప్ప కాదు. ప్రేక్షకుడిని థియేటర్‌కు తీసుకురావడం ముఖ్యం' అన్నారు. 'రేవు' సినిమా కాన్సెప్ట్ బాగుంది. ఈ చిత్రాన్ని చూసి నేనూ రివ్యూ రాస్తా' అన్నారు దిల్ రాజు. నిర్మాతల్లో ఒకరైన మురళి మాట్లాడుతూ 'ఒక మంచి చిత్రంతో నా సినీ జర్నీ మొదలైంది. మా సినిమాను చూసి ఆదరించండి' అని కోరారు. తక్కువ బడ్జెట్‌లోనే ఎంత అద్భుతంగా సినిమా తీయవచ్చో దర్శకుడు హరినాథ్ నిరూపించారు' అని ప్రభు చెప్పారు. ఈ కార్యక్రమంలో ఎగ్జిక్యూటివ్ నిర్మాత పర్వతనేని రాంబాబు పాల్గొన్నారు.

గాయని పి. సుశీలకు అస్వస్థత



ప్రముఖ గాయని పి. సుశీల శనివారం అస్వస్థతకు గురయ్యారు. కడుపు నొప్పితో ఆమె చెన్నైలోని కావేరి ఆస్పత్రిలో చేరారు. ప్రస్తుతం ఆమెకు చికిత్స అందుతోంది. ఆరోగ్యం నిలకడగా ఉన్నట్లు వైద్యులు వెల్లడించారు. కొంతకాలంగా సుశీల అనారోగ్యంతో బాధపడుతున్నారు.

ఇన్ ప్రోగ్రెస్



'ఆయ్' టీమ్‌కు ఎన్టీఆర్ అభినందనలు

నార్నే నితిన్, నయన్ సారిక జంటగా రూపొందిన 'ఆయ్' చిత్రం ఇటీవల విడుదలై సూపర్ హిట్ టాక్ సాధించింది. ఈ సినిమాకు పాజిటివ్ రివ్యూలు కూడా రావడంతో టీమ్‌ను అందరూ ప్రశంసిస్తున్నారు. శనివారం యూనిట్ సభ్యులు జూనియర్ ఎన్టీఆర్‌ను కలుసుకుని ఆయన అభినందనలు పొందారు. బాక్సాఫీసు దగ్గర గట్టి పోటీ ఉన్నప్పటికీ 'ఆయ్' హిట్ కావడంతో ఎన్టీఆర్ వారిని అభినందించారు. నార్నే నితిన్, నయన్ సారిక, అంకిత్ కొయ్య, నిర్మాతలు బన్నీ వాసు, ఎస్.కె.ఎన్. శనివారం ఎన్టీఆర్‌ను కలిశారు.

రోషన్ హీరోగా 'ఛాంపియన్'



నటుడు శ్రీకాంత్ తనయుడు రోషన్ హీరోగా నటించే కొత్త చిత్రం 'ఛాంపియన్' షూటింగ్ శనివారం మొదలైంది. నేషనల్ అవార్డ్ విన్నింగ్ డైరెక్టర్ ప్రదీప్ అద్వైతం ఈ సినిమాకు దర్శకత్వం వహిస్తున్నారు. పీరియాడికల్ బ్యాక్‌డ్రాప్‌లో రూపుదిద్దుకొనే ఈ చిత్రం షూటింగ్ ను దర్శకుడు నాగ్‌అశ్విన్ తొలి క్లాప్ ఇచ్చి ప్రారంభించారు. సరికొత్త పాత్రలో రోషన్‌ను ప్రజెంట్ చేయడానికి ఓ విభిన్నమైన స్క్రిప్ట్‌ను దర్శకుడు ప్రదీప్ సిద్ధం చేశారు. ఈ చిత్రానికి ఛాయాగ్రహణం: ఆర్. మది, కళా దర్శకుడు: తోట తరణి, నిర్మాణం: స్వప్న సినిమా, ఆనంది ఆర్ట్స్, కాన్సెప్ట్ ఫిల్మ్స్.

భయపెట్టేందుకు సిద్ధం



అరుల్ నిధి, ప్రియా భవానీ శంకర్ జంటగా నటించిన హారర్ థ్రిల్లర్ 'డిమోంటి కాలనీ 2'. ఈ చిత్రం విడుదల తేదీ ఖరారైంది. ఈ నెల 23న విడుదల చేస్తున్నట్లు చిత్రబృందం తెలిపింది. అజయ్ ఆర్ జ్ఞానముత్తు దర్శకత్వంలో విజయ్ సుబ్రహ్మణ్యన్, ఆర్. సి రాజ్‌కుమార్ ఈ చిత్రాన్ని నిర్మించారు.

తెనాలి వార్తలు

◆ తెనాలి ◆ పొన్నూరు



సమావేశంలో మాట్లాడుతున్న మాజీ మంత్రి ఆలపాటి

సమన్వయంతో గ్రామాల అభివృద్ధికి కృషి చేస్తాం

● మాజీ మంత్రి ఆలపాటి రాజేంద్రప్రసాద్

కొల్లిపర, ఆగస్టు 17 : సమన్వయంతో పని చేసి గ్రామాలాభివృద్ధికి కృషి చేస్తామని మాజీ మంత్రి ఆలపాటి రాజేంద్రప్రసాద్ అన్నారు. శనివారం మండల పరిధిలోని బొమ్మువానిపాలెంలో ఏర్పాటు చేసిన కార్యకర్తల సమావేశంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. నాయకులను, కార్యకర్తలను గ్రామాల్లో ఉన్న సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా పలువురు రోడ్లు, డ్రైనేజీలు సరిగా లేవని ఆలపాటి దృష్టికి తీసుకువచ్చారు. అనంతరం రాజేంద్రప్రసాద్ మాట్లాడుతూ పేద ప్రజల సంక్షేమం, అభివృద్ధి కోసం ప్రభుత్వం పనిచేస్తుందన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాతు పెన్షన్ రూ.4 వేలు పెంచటం హర్షించ తగ్గ విషయమన్నారు. రానున్న ఐదేళ్లలో గ్రామాల్లోని రోడ్లు, మురుగు కాల్వలు నిర్మించుకుందామన్నారు. సమావేశంలో టీడీపీ మండల అధ్యక్షుడు భీమవరపు చినకోటిరెడ్డి, టీడీపీ రాష్ట్ర తెలుగురైతు కార్యనిర్వాహక కార్యదర్శి వంగా సాంబిరెడ్డి, టీడీపీ జిల్లా కార్యదర్శి కంచర్ల అమృతరాజు, సర్పంచ్ కొల్లి రజనీ, టీడీపీ నేతలు గోవర్ధనరెడ్డి, మొవ్వా రాజా, కొల్లి శివరామిరెడ్డి, నరసయ్య పాల్గొన్నారు.



ఆక్రమణల తొలగింపు పనులను పర్యవేక్షిస్తున్న కమిషనర్ శేషన్న

మునిసిపల్ స్థలాలు ఆక్రమిస్తే చర్యలు తప్పవు

● ఆక్రమణల తొలగింపు కార్యక్రమంలో కమిషనర్ శేషన్న

తెనాలి రూరల్, ఆగస్టు 17: మునిసిపల్ స్థలాలు ఆక్రమిస్తే చట్ట ప్రకారం చర్యలు తప్పవని మునిసిపల్ కమిషనర్ శేషన్న అన్నారు. శనివారం పట్టణంలోని బోస్‌రోడ్డులో ప్రధాన రోడ్డుపై ఉన్న డ్రైన్లమీద ఆక్రమణల తొలగింపు పనులను ఆయన క్షేత్రస్థాయిలో పర్యవేక్షించారు. ఈ సందర్భంగా కమిషనర్ శేషన్న మాట్లాడుతూ తెనాలి పట్టణాన్ని పరిశుభ్రతలతో కూడిన పట్టణంగా తీర్చిదిద్దేలా చర్యలు చేపట్టామన్నారు. మునిసిపల్ స్థలాలపై, డ్రైన్లపై పలువురు ఆక్రమణ దారులు ఆక్రమించుకుని వాటిపై వ్యాపారాలు నిర్వహిస్తున్నారని తెలిపారు. ఇటీవల కాలంలో వారికి నోటీసులు జారీ చేయడం జరిగిందన్నారు. పట్టణంలోని పలువార్డుల మురుగునీరు డ్రైన్ల ద్వారా ప్రవహించాల్సి ఉంటుందని వాటిపై ఆక్రమణలు ఉండటంతో వాటి పూడికలు తీయడం సమస్యగా మారిందన్నారు. ఫలితంగా వర్షాలుకురిస్తే ఆ నీటితో కలిసి మురుగు నీరు రోడ్లపైకి చేరి అపరిశుభ్రవాతావరణం నెలకొంటుందని చెప్పారు. ప్రజలకు అసౌకర్యం కలుగకుండా పట్టణాన్ని తీర్చిదిద్దే ఉద్దేశంతో ఆక్రమణలు తొలగించి డ్రైన్ల పూడికలు చేపట్టామని కమిషనర్ పేర్కొన్నారు. ప్రజలందరూ మునిసిపాలిటీకి సహకరించాలని ఆయన విజ్ఞప్తి చేశారు. అసిస్టెంటసిటీప్లానర్ సుధాకర్, సుబ్బారావు, టౌన్ ప్లానింగ్ సూపర్‌వైజర్ సునీల్, శానిటరీ ఇన్‌స్పెక్టర్స్ ఆకురాతి రామచంద్రరావు, శ్రీనివాసరరావు పాల్గొన్నారు.

పారిశుధ్య పనుల పరిశీలన

పట్టణంలోని 32వ వార్డులో మునిసిపల్ కమిషనర్ శేషన్న పర్యటించి అక్కడ జరుగుతున్న పారిశుధ్య పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా కమిషనర్ శేషన్న మాట్లాడుతూ మునిసిపల్ పారిశుధ్య కార్మికులు ప్రతి రోజు డ్రైన్లను పరిశీలించాలన్నారు. వ్యర్థాలు పేరుకుపోయి ఉంటే వాటిని వెంటనే తొలగించి నీరు పారుదల సక్రమంగా జరిగేలా చర్యలు చేపట్టాలన్నారు. ప్రతి వార్డులో తాను ఆకస్మిక తనిఖీలు చేయడం జరుగుతుందని ఎక్కడా కూడా పారిశుధ్యంపై ఫిర్యాదులు రాకుండా విధులు సక్రమంగా నిర్వహించాలని సూచించారు. ఆయనతో మునిసిపల్ అధికారులు, సిబ్బంది ఉన్నారు.



కొలకలూరు శివారు ప్రధాన రోడ్డుపై ధర్నా చేస్తున్న రైతులు

సాగు నీటి కోసం రైతుల ఆందోళన

తెనాలి రూరల్, ఆగస్టు 17: తెనాలి మండలం కొలకలూరు శివారు తంగెళ్లమూడి డొంక సమీపంలో రైతులు శనివారం తెనాలి- కొలకలూరు - గుంటూరు ప్రధాన రహదారిపై బైటాయించి సాగునీరు విడుదల చేయాలంటూ ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా రైతులు మాట్లాడుతూ గత ఐదుళ్లుగా వైసీపీ ప్రభుత్వంలో సాగునీరు అందక పంటలు ఎండిపోయి తీవ్రంగా నష్టపోయామని ఆరోపించారు. ప్రభుత్వం మారి కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టిన తరువాతైనా రైతాంగానికి సకాలంలో నీరు అందిస్తారని ఆశతో చిన్న, సన్నకారు రైతులు సైతం సాగు చేపట్టామన్నారు. దాదాపుగా 40 రోజులు దాటుతున్నా తమ పంటపొలాలకు నీరు అందక గతంలో మాదిరి పంటలను నష్టపోయే పరిస్థితి ఉత్పన్నమైందని వాపోయారు. దీనిపై పలుమార్లు అధికారులకు విన్నవించిన తమ గోడు ఆలకించేవారే కరువయ్యారని ఆవేధనవ్యక్తం చేశారు. ఎండవిపరీతంగా ఉన్నా తమ బాధలు ప్రభుత్వానికి తెలియాలన్న ఉద్దేశంతో రైతులందరం కలిసి రోడ్డుపైకి వచ్చి నిరసన చేస్తున్నామని తెలియజేశారు. సుమారుగా 3000 ఎకరాల వరకూ వరిపంటలకు సాగునీరు అందించాల్సి ఉందని రైతులు తెలిపారు. కూటమి ప్రభుత్వం స్పందించి వెంటనే సాగునీరు విడుదల చేసి అన్నదాతలను ఆదుకోవాలని వారు విజ్ఞప్తి చేశారు. మండల తహసీల్దార్ గోపాలకృష్ణ నిరసన తెలుపుతున్న రైతుల వద్దకు చేరుకుని 24గంటల్లో నీరు అందేలా చూస్తామని హామి ఇవ్వడంతో నిరసన విరమించారు. కొలకలూరు, హాఫ్‌పేట, ఖాజీపేట, తండెళ్లమూడి, తదితర గ్రామాల రైతులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న సీపీఎం నాయకులు జంగాల అజయ్‌కుమార్

మహిళల రక్షణకు ప్రత్యేక చట్టం తేవాలి

● సీపీఐ జిల్లా కార్యదర్శి అజయ్‌కుమార్

తెనాలి రూరల్, ఆగస్టు 17: దేశంలో ప్రాణాలకు కాపాడే డాక్టర్లకే రక్షణ లేనప్పుడు సామాన్య మహిళలకు రక్షణ ఎక్కడ నుంచి వస్తుందని సీపీఐ జిల్లా కార్యదర్శి జంగాల అజయ్‌కుమార్ అన్నారు. శనివారం పట్టణంలోని గాంధీనగర్ సీపీఐ కార్యాలయంలో నియోజవర్గ పార్టీ నాయకలు, కార్యకర్తలతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన అజేయ్ కుమార్ మాట్లాడుతూ పశ్చిమబెంగాల్‌లోని వైద్యశాలలో ట్రైనీ వైద్యురాలిపై జరిగిన అత్యాచారం, హత్యను తీవ్రంగా ఖండించారు. కేంద్ర ప్రభుత్వం మహిళలకు ప్రత్యేక రక్షణ చట్టం తీసుకురాకపోవడం వల్లనే వారికి భద్రత కరువైందని విమర్శించారు. దేశానికి స్వాతంత్ర్యం సిద్ధించి 78 ఏళ్లు కావస్తున్నా మహిళలపై అఘాయిత్యాలు ఆగడంలేదన్నారు. ఇప్పటికైనా ఇటువంటి ఘటనలు పునరావృతం కాకుండా మహిళల రక్షణకు ప్రత్యేక చట్టాన్ని తీసుకురావాలని అజేయ్‌కుమార్ డిమాండ్ చేశారు. అనంతరం సీపీఐ శత వార్షికోత్సవాల నిర్వహణపై పార్టీ శ్రేణులకు దిశానిర్ధేశం చేశారు. సమావేశంలో నియోజవర్గ కార్యదర్శి చెరుకుమల్లి సింగారావు, పట్టణ కార్యదర్శి మద్దినేని కిరణ్, సీపీఐ పార్టీ నాయకులు బొల్లిముంత కృష్ణ, ఏఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షుడు పాశం వెంకటేష్, ఏఐవైఎఫ్ పట్టణ అధ్యక్ష,కార్యదర్శులు కుంభ రవితేజ, రాజేష్, నాయకులు చెన్నూరు సాయి, కావేటి యశ్వంత్, భూమేష్, ప్రసన్న గణేష్, అమాన్ తదితరులు పాల్గొన్నారు.

వైద్యులపై అఘాయిత్యాలు దారుణం



డీవీసీ ఆస్పత్రి ముందు నిరసన తెలుపుతున్న వైద్యులు, సిబ్బంది

● డీవీసీ హాస్పటల్ ఎండీ జ్యోతిర్మయి
● వైద్యులకు, వైద్యేతర సిబ్బందికి భద్రత కల్పించండి
● విధులు బహిష్కరించి నిరసన తెలిపిన వైద్యులు
● జిల్లా ప్రభుత్వ వైద్యశాలలో నల్ల బ్యాడ్జీలతో నిరసన

పొన్నూరుటౌన్ (చేబ్రోలు), ఆగస్టు 17 : వైద్యులపై జరుగుతున్న అగాయిత్యాలు దారుణమని డీవీసీ హాస్పటల్ మేనేజింగ్ డైరెక్టర్ ధూళిపాళ్ళ జ్యోతిర్మయి అన్నారు. పశ్చిమబెంగాల్ రాష్ట్రంలోని కలకత్తా ఆర్జీకర్ ఆస్పత్రిలో వైద్య విద్యార్థినిపై అత్యాచారం, హత్య ఘటనను ఖండిస్తూ ఇండియన్ మెడికల్ అసోసియేషన్ పిలుపు మేరకు వడ్లమూడి డీవీసీ హాస్పిటల్ వైద్యులు, సిబ్బంది శనివారం ఓపీ సేవలు నిలిపివేసి ఆస్పత్రి గేటు ముందు నిరసన వ్యక్తం చేశారు. వైద్యులు, ఆస్పత్రి ఎండీ ధూళిపాళ్ళ జ్యోతిర్మయి ఈ నిరసన కార్యక్రమానికి సంఘీభావం తెలుపుతూ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. కలకత్తా ఆర్జీకర్ ఆస్పత్రిలో పీజీ వైద్య విద్యార్థినిపై జరిగిన అమానుష ఘటనను మానవతావాదులందరూ తప్పక ఖండించాలన్నారు. నిందితులను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేసారు. వైద్యులు లలీత్, రజిత, సుధ మాట్లాడుతూ విధి నిర్వహణలో ఉన్న వైద్యుల రక్షణకు పటిష్ట చర్యలు తీసుకోవాలని ప్రభుత్వాలను కోరారు. పని ప్రదేశాల్లో మహిళా వైద్యులు, సిబ్బంది పై జరుగుతున్న వేధింపులపై ప్రభుత్వాలు కఠినంగా వ్యవహరించే చట్టాలను రూపొందించాలని డిమాండ్ చేసారు. కార్యక్రమంలో హాస్పిటల్ మెడికల్ డైరెక్టర్ డాక్టర్ చల్లగండ్ల శ్రీనివాస్, సీవోవో డాక్టర్ కరణం నవీన్, సూపరింటెండెంట్ డాక్టర్ అమరేంద్ర, వైద్యులు నాగేశ్వరరావు, శ్రీరామ్, సందీప్, మనోహర్, తేజశ్రీ, దివ్య స్మృతి, సుష్మ, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.



ప్లే కార్డులతో నిరసన ప్రదర్శన నిర్వహిస్తున్న సిబార్ కళాశాల విద్యార్థులు

పొన్నూరు పట్టణంలో....

ఇండియాన్ మేడికల్ అసోసియేషన్ పిలుపు మేరకు శనివారం పొన్నూరు పట్టణంలోని అన్ని ప్రభుత్వ, ప్రైవేటు ఆస్పత్రుల్లో ఓపీ వైద్య సేవలు నిలిపివేసి తమ నిరసనను తెలియజేశారు. పొన్నూరు ప్రభుత్వ వైద్యశాల వైద్యులు, సిబ్బంది హాస్పటల్ నుంచి ఐలాండ్ సెంటర్ వరకు నిరసన ప్రదర్శన చేపట్టారు. వైద్యుల రక్షణకు ప్రత్యేక చట్టాలు రూపొందించాలని, కలకత్తా ఘటనలో నిందితులను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేసారు. కార్యక్రమంలో ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ రేష్మా తదితరులు పాల్గొన్నారు.

తెనాలి రూరల్: ప్రాణాలు కాపాడే వైద్యులకే రక్షణలేకుండా పోయిందని తెనాలి జిల్లా ప్రభుత్వవైద్యశాల సూపరింటెండెంట్ డాక్టర్ సౌభాగ్యవాణి అన్నారు. కోల్‌కత్తాలో ఓ ట్రైనీ డాక్టర్‌ను హత్యచేసిన ఘనను ఖండిస్తూ శనివారం జిల్లా ప్రభుత్వవైద్యశాల్లో వైద్యులు, సిబ్బంది విధులను బహిష్కరించి నల్లబ్యాడ్జీలతో నిరసన తెలిపారు. ఈ సందర్భంగా సౌభాగ్యవాణి మాట్లాడుతూ నిత్యం రోగుల మద్య ఉండి వైద్యసేవలందించే వైద్యులకు, సిబ్బందికి సరైన రక్షణ చట్టం లేకపోవడం వల్లనే దాడులు, హత్యలు జరుగుతున్నాయని ఆరోపించారు. వైద్యులందరికీ రక్షణ చట్టం కల్పించి వారికి భద్రత కల్పించాలని ఆమె కోరారు. కార్యక్రమంలో వైద్యశాల వైద్యులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

తెనాలి అర్బన్: కలకత్తాలో జరిగిన సంఘటనపై ప్రభుత్వం కఠిన చర్యలు చేపట్టాలని ఇండియన్ మెడికల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో శనివారం పట్టణంలో నిరసన ప్రదర్శన చేశారు. వైద్యురాలిని అత్యాచారం చేయడమే కాకుండా అత్యంత అమానుషంగా హత్యచేయటం దారుణమని ఐఎంఏ ప్రధాన కార్యదర్శి పవని ప్రియాంక ఆవేదన వ్యక్తం చేశారు. స్వాతంత్ర్యం వచ్చి 78 ఏళ్లు అవుతున్నా మహిళలపై, ముఖ్యంగా వైద్యులపై ఇలాంటి ఘటనలు జరగటం ఆందోళన కలిగించే విషయమన్నారు. అనంతరం సబ్ కలెక్టర్ కార్యాలయంలో వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో వైద్యులు ఉమామహేశ్వరరావు, ఉదయభాస్కర్, హిమని, అనీల్‌కుమార్, జీవనలత, శేషగిరిరావు, పురుషోత్తమరావు, దక్షిణామూర్తి, మస్తానమ్మ, శ్యాంప్రసాద్, సుబ్బారావు, యువ క్రికెట్ మాలిక్, ఉదయభాస్కర్ పాల్గొన్నారు.

కలకత్తా ఘటనను ఖండిస్తూ బుర్రిపాలెం రోడ్డులోని ఎఎస్ఎన్ ఫార్మసీ కళాశాల అధ్యాపకులు, విద్యార్థులు శనివారం కొవ్వొత్తులతో నిరసన ర్యాలీ చేపట్టారు. ప్రిన్సిపాల్ వెంకటరమణ మాట్లాడుతూ అనాగరికంగా జరిగిన ఈ చర్య దేశం మొత్తాన్ని దిగ్భ్రాంతికి గురిచే సిందన్నారు. నిందితులను కఠినంగా శిక్షించి, ఇలాంటివి పునరావృతం కాకుండా చూడాలని కోరారు.

పెదకాకాని: కోల్‌కత్తా ఘటనను తీవ్రంగా ఖండిస్తూ శనివారం ఆచార్యనాగార్జున యూనివర్సిటీలో విద్యార్థులు నిరసన ప్రదర్శన చేప్పారు. ఈ సందర్భంగా ఆచార్య నాగార్జున యూనివర్సిటీ టీఎన్ఎస్ఎఫ్ అధ్యక్షుడు బత్తుల హేమంత్ మాట్లాడుతూ దేశానికి స్వతంత్రం వచ్చి 78 సంవత్సరాలు అవుతున్న ఇప్పటికీ ఆడపిల్లలకు రక్షణలేక పోవడం శోచనీయ మన్నారు. ఆర్జీకర్ ట్రైనీ వైద్య విద్యార్థిని ఘటనలో వెస్ట్ బెంగాల్ ప్రభుత్వం నిందితులను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో విద్యార్థులు శ్రీధర్, ఏఎస్ఎఫ్ నేత రాజేష్, టీఎన్ ఎస్ఎఫ్ నేతలు కొర్రపాటి అభిషేక్, అఖిల్, స్వామి, భాను, శిరీష్, హరీష్, యశ్వంత్ తదితరులు పాల్గొన్నారు.

సిబార్ దంత వైద్యకళాశాల విద్యార్థులు, యాజమాన్యం శనివారం కళాశాల నుంచి తక్కెళ్ళ పాడు పంచాయతీ కార్యాలయం వరకు నిరసన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు మాట్లాడుతూ కలకత్తా జరిగినది హృదయ విధార సంఘటన అని అన్నారు. దేశంలో ఇటువంటివి పునరావృతం కాకుండా పటిష్టమైన చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో కళాశాల డీన్ డాక్టర్ ఎల్ కృష్ణప్రసాద్, డైరెక్టర్ డాక్టర్ టీ.కృష్ణమోహన్, ప్రిన్సిపాల్ బీవీ రమణారెడ్డి, విద్యార్థులు, అధ్యాపకులు పాల్గొన్నారు.



తెనాలి జిల్లా ప్రభుత్వ వైద్యశాల్లో నల్లబ్యాడ్జిలతో వైద్యుల నిరసన



నాగార్జున యూవర్సిటీలో నిరసన ర్యాలీ నిర్వహిస్తున్న విద్యార్థులు

మాజీ ఎంపీటీసీ ఈశ్వరమ్మ మృతి

● నివాళులర్పించిన ఎమ్మెల్యే ధూళిపాళ్ల నరేంద్రకుమార్

చేబ్రోలు, ఆగస్టు17:మండల పరిధిలోని నారాకోడూరు గ్రామానికి చెందిన మాజీ ఎంపీటీసీ దానబోయిన లక్ష్మీ ఈశ్వరమ్మ శనివారం మృతి చెందారు. ఈశ్వరమ్మ మృతి వార్త తెలుసుకున్న ఎమ్మెల్యే ధూళిపాళ్ళ నరేంద్ర కుమార్ నారా కోడూరు గ్రామానికి విచ్చేసి ఈశ్వరమ్మ భౌతికకాయాన్ని సందర్శించి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈశ్వరమ్మ భర్త దానబోయిన అంకమ్మరావును పరామర్శించి సంతాపం తెలిపారు.



సమావేశంలో మాట్లాడుతున్న లాంఫాం శాస్త్రవేత్త సాంబశివరావు

సేంద్రియ సాగు పద్ధతులు అవలంభించాలి

● లాంఫాం శాస్త్రవేత్త ఎన్ సాంబశివరావు

చేబ్రోలు , ఆగస్టు 17: రైతులు సేంద్రీయ సాగు పద్ధతులు అవలంభించాలని లాంఫాం శాస్త్రవేత్త ఎన్.సాంబశివరావు అన్నారు. మండల పరిధిలోని వేజండ్ల గ్రామంలో జిల్లా వనరుల కేంద్రం ఆధ్వర్యంలో రైతు శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. లాంఫాం నుంచి వచ్చిన శాస్త్రవేత్తలు రైతులకు గ్రామీణ విత్తనోత్పత్తి పథకం గురించి అవగాహన కల్పించారు. సమగ్ర ఎరువుల యాజమాన్య పద్ధతుల గురించి సూచించారు. రైతులే స్వయంగా విత్తనాని రూపొందించుకుని తోటి రైతులకు అందించే అవకాశం ఉందని తెలిపారు. వరి నాటిన వెంటనే కలుపు నివారణ చర్యలు చెపట్టాలని సూచించారు. జీవన ఎరువుల వినియోగం గురించి వివరించారు. సేంద్రీయ పద్ధతులో వరి సాగు చేపట్టడం ద్వారా అధి దిగుబడులు పొందవచ్చన్నారు. కార్యక్రమంలో జిల్లా వనరుల కేంద్రం ఏడీఏ ఐ .సునీత, ఏవో రాజవంశీ, స్థానిక ఏవో బీ. శ్రీనివాస్ నాయక్, ఏఈవో సునీత, పలువురు రైతులు పాల్గొన్నారు.

తెనాలి సబ్ కలెక్టర్ ప్రకార్ జైన్ బదిలీ

గుంటూరు, ఆగస్టు 17 (ఆంధ్రజ్యోతి): తెనాలి సబ్ కలెక్టర్ ప్రకార్ జైన్ బదిలీ అయ్యారు. 2021 సివిల్స్ బ్యాచ్‌కు చెందిన ఆయన గత ఏడాది ఆఖరులో తెనాలి సబ్ కలెక్టర్‌గా బదిలీపై వచ్చారు. ఆ తర్వాత ఎన్నికల వాతావరణంవచ్చేసింది. తెనాలి అసెంబ్లీ నియోజకవర్గం రిటర్నింగ్ అధికారిగా ఆయన సమర్థవంతంగా బాధ్యతలు నిర్వహించారు. తెలుగుదేశం పార్టీ కూటమి ప్రభుత్వం ఏర్పడ్డాక ఐఏఎస్‌ల బదిలీలు జరిగాయి. అయితే ప్రకార్ జైన్ సబ్ కలెక్టర్‌గా వచ్చి కొన్ని నెలలే కావడంతో ఆయన బదిలీ ఉండదని అంతా భావించారు. సీనియర్ ఐఏఎస్, కలెక్టర్లు, జేసీల బదిలీలు పూర్తి కావడంతో మరికొంత కాలం ఇక్కడే కొనసాగుతారని ఆశించారు. అయితే శనివారం రాత్రి ప్రకార్ జైన్‌ని పాడేరు సబ్ కలెక్టర్‌గా నియమిస్తూ రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి నీరబ్‌కుమార్ ప్రసాద్ ఉత్తర్వులు జారీ చేశారు. పాడేరు ఐటీడీఏ పీవో బాధ్యతలు కూడా ఆయనకు అదనంగా కేటాయించారు. బదిలీ అయిన జైన్ స్థానంలో కొత్తగా ఎవ్వరిని నియమించలేదు.

పశువుల దొంగల పట్టవేత

కొల్లిపర, ఆగస్టు 17: పశువులను దొంగతనానికి వచ్చిన ముగ్గురు వ్యక్తులను శుక్రవారం అర్థరాత్రి గ్రామస్థులు పట్టుకుని పోలీసులకు అప్పగించిన సంఘటన బొమ్మువానిపాలెంలో జరిగింది. పోలీసులు తెలిపిన వివరాలు ప్రకారం.. బొమ్మువానిపాలెంకు చెందిన తుమాటి అజయ్ పశువులను పాకలో కట్టివేయగా అర్థరాత్రి ముగ్గురు వ్యక్తులు పశువులను దొంగతనం చేయటానికి ప్రయత్నించారు. గమనించిన అజయ్ ముగ్గురు వ్యక్తులను పట్టుకోవటానికి ప్రయత్నింగా ఇద్దరు మాత్రమే దొరకటంతో పట్టుకొని పోలీసుస్టేషన్‌లో అప్పగించారు. ఆ ఇద్దరూ వ్యక్తులు దుగ్గిరాలకు చెందిన తిప్పగుడిచి దేవదాసు, గాలి రామారావులుగా గుర్తించినట్లు పోలీసులు తెలిపారు.

పంచాయితీ రాజ్ డీఈఈగా ప్రసాద్

పొన్నూరుటౌన్, ఆగస్టు17: పంచాయితీ రాజ్ డిఈఈగా ప్రసాద్ శనివారం బాధ్యతులు స్వీకరించారు. ప్రసాద్ రేపల్లె డివిజన్ నుంచి ప్రసాద్ బదలిపై పొన్నూరు వచ్చారు. గతంలో ప్రసాద్ పొన్నూరు పంచాయితీరాజ్ జేఈఈగా సమర్ధవంతంగా విధులు నిర్వహించారు. నూతన డీఈఈగా బాధ్యతలు స్వీకరించిన ప్రసాద్‌ను సహచర సిబ్బంది, అధికారులు అభినందించారు.

జర్నలిస్టుల సంక్షేమానికి రోటరీక్లబ్ కృషి

● రోటరీ క్లబ్ అధ్యక్షుడు ఈదర శ్రీనివాసరావు
● పాత్రికేయులకు రూ. 10 లక్షల ప్రమాద బీమా

తెనాలి రూరల్ ఆగస్టు 17: నిత్యం ప్రజల కోసం, సమాజం కోసం పాటుబడే జర్నలిస్టుల సంక్షేమానికి రోటరీక్లబ్ ఆఫ్ తెనాలి, వైకుంఠపురం అండగా ఉంటుందని క్లబ్ అధ్యక్షుడు ఈదర శ్రీనివాసరరావు చెప్పారు. శనివారం పట్టణంలోని క్లబ్ కార్యాలయంలో రోటరీక్లబ్ తెనాలి వైకుంఠపురం, బిల్డర్స్ అసోసియేషన్ సంయుక్తఆధ్వర్యంలో తెనాలి నియోజవర్గ ఏపీయూడబ్ల్యుజే పాత్రికేయులు 60 మందికి తపాల శాఖ ద్వారా ప్రమాద బీమా రూ.10 లక్షల బాండ్లను యూనియన్ అధ్యక్షుడు చందుసుబ్బారావు, గోపిచంద్ ఇతర సభ్యులకు అంద జేశారు. ఈ సందర్భంగా క్లబ్ అధ్యక్షుడు శ్రీనివాసరరావు మాట్లాడుతూ నిత్యం వార్తా సేకరణలో వ్యయ ప్రయాసాలను ఓర్చి ముందుకు సాగే విలేకరులకు ప్రమాద బీమా దీమా కల్పిస్తుందన్నారు. కార్యదర్శి మురళీకృష్ణమాట్లాడుతూ సమాజంలో సమస్యల పట్ల స్పందించే పాత్రికేయులకు భీమా సౌకర్యం అవసరమని దీనిని రోటరీ బిల్డింగ్ అసోసియేషన్ సంయుక్తంగా ఏర్పాటుచేసి అందించడం జరిగిందన్నారు. కార్యక్రమంలో బిల్డర్ అసోసియేషన్ ప్రతినిధులు కన్నెగంటి మురళీకృష్ణ, ఈదర వెంకటపూర్ణచంద్, కృష్ణ, రోటరీయన్స్ పావులూరి రాంబాబు, గుమ్మడి ప్రసాద్, నారాయణ, ఉపేంద్ర, వెంకటేశ్వరరావు, ఎపీయూడబ్ల్యుజే తెనాలి నియోజవర్గ కార్యవర్గ సభ్యులు సాయినాథ్, శరత్‌బాబు, కిరణ్‌కుమార్, కల్యాణ్ మాస్టార్, మురళీకృష్ణ తదితరులు పాల్గొన్నారు.



యూనియన్ అధ్యక్షుడు సుబ్బారావు, గోపిచంద్‌లకు బాండ్లను అందిస్తున్న క్లబ్ అధ్యక్షుడు శ్రీనివాసరరావు,మురళికృష్ణ, వెంకటపూర్ణచంద్



చిన్నారుల మృతదేహాలను సందర్శించి నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే నరేంద్ర కుమార్

చిన్నారుల మృతి బాధాకరం

● కుటుంబాలకు అండగా నిలబడతాం
● పొన్నూరు ఎమ్మెల్యే ధూళిపాళ్ల నరేంద్ర కుమార్

పెదకాకాని, ఆగస్టు 17 : పెదకాకాని గ్రామం లూథర్‌గిరి కాలనీలో ఇంటి ప్రహరీ కూలి చిన్నారులు మృతిచెందటం అత్యంత బాధాకరమని పొన్నూరు ఎమ్మెల్యే దూళిపాళ్ల నరేంద్రకుమార్ అన్నారు. కోలాటపు స్వాతిక్ , బంగారపు సిద్ధార్థ్ అనే ఇద్దరు చిన్నారులు ప్రహరీ కూలి మృతి చెందగా వారి పార్థవ దేహాలను శనివారం ఎమ్మెల్యే నరేంద్రకుమార్ సందర్శించి నివాళులర్పించి, వారి కుటుంబ సభ్యులకు తన ప్రగాఢ సానుభూతిని తెలియచేశారు. ఈ సందర్భంగా ప్రభుత్వం తరపున అన్ని విధాలుగా అండగా ఉంటానని వారికి హామీ ఇచ్చారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. ప్రజలు శిథిలావస్థలో ఉన్న కట్టడాలు పట్ల అప్రమత్తంగా ఉండాలని సూచించారు. చిన్నారుల మట్టి ఖర్చుల నిమిత్తం ఒక్కొక్క కుటుంబానికి రూ. 5 వేలు ఆర్థికసాయంగా అందజేశారు. కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షుడు వలివేటి మురళీకృష్ణ, నేతలు కొర్రపాటి సురేష్, లింగంగుంట సాల్మన్‌రాజు, పొన్నూరు నియోజకవర్గ ఎస్సీ సెల్ అధికార ప్రతినిధి ఆత్మకూరి వెంకటేశ్వర్లు, ఎస్సీ సెల్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బొల్లెద్దు సుశీలరావు, బెజ్జం గోపాలకృష్ణ, కోలాటపు మాణిక్యరావు ఆత్మకూరి ఆదినారాయణ, లింగంగుంట అశోక్ ,బుర్రా గోవిందరావు, కోలాటపు రాజు, తదితరులు పాల్గొన్నారు.

ఆటోకార్మికుడికి రాజకుమారి ప్రశంస



గుంతలు పూడుస్తున్న నాగరాజును అభినందిస్తున్న నన్నపనేని రాజకుమారి

తెనాలి రూరల్, ఆగస్టు 17: తెనాలి - మంగళగిరి రోడ్డులో పెద్ద పెద్ద గుంతలు ఏర్పడి వాహనదారులు ప్రమాదాల బారిన పడుతున్నారు. నిత్యం వేలాది మంది రాకపోకలు సాగించే ఈ రోడ్డుపై ఉన్న ప్రమాదకర గుంతలను పూడ్చేందుకు ఓ ఆటో కార్మికులు నడుంబిగించాడు. రోడ్డుపక్కన ఉన్న మట్టిని తీసుకుని రోడ్డుపై గుంతల్లో పోసి వాటినిపూడుస్తూ తోటి వాహన దారులకు ప్రమాదం జరగకూడదని మానవత్వం చాటాడు. ఆక్రమంలో విజయవాడ వైపు వెళుతున్న మాజీ మహిళా చైర్‌పర్సన్ నన్నపనేని రాజకుమారి ఆటో కార్మికుడు చేస్తున్న పనిని చూసి తన కారు దిగి నాగరాజును అభినందించారు. రోడ్డు దుస్థితిపై సీఎం చంద్రబాబునాయుడికి తెలిపి సమస్యపరిష్కరించేలా చూస్తానని హామీ ఇచ్చారు. నాగరాజు చర్యను ఆ రోడ్డుపై వెళ్లే వాహనదారులు పలువరు ప్రసంసలు కురిపించారు.

జిల్లా విజన్ యాక్షన్ ప్లాన్ సిద్ధం చేయాలి

● ప్రణాళిక శాఖ ప్రిన్సిపల్ సెక్రెటరీ పీయూష్‌కుమార్

గుంటూరు, ఆగస్టు17 (ఆంధ్రజ్యోతి): వికసిత్ ఆంధ్రప్రదేశ్ 2047లో భాగంగా జిల్లాలోని అన్ని శాఖలు విజన్ యాక్షన్ ప్లాన్‌ను సిద్ధం చేసి అందించాలని రాష్ట్ర ప్లానింగ్‌శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ పీయూష్ కుమార్ ఆదేశించారు. రాష్ట్ర సచివాలయం నుంచి ఆయన వికసిత్ ఆంధ్రప్రదేశ్ 2047 జిల్లాల విజన్ యాక్షన్ ప్లాన్ సిద్ధ చేయటంపై జిల్లా అధికారులతో శనివారం వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమావేశం నిర్వహించారు. పీయూష్ కుమార్ మాట్లాడుతూ వికసిత్ ఆంధ్రప్రదేశ్ 2047లో ప్రతి సంవత్సరం రాష్ట్రంలోని అభివృద్ధి, సంక్షేమ రంగాల్లో 15శాతం తగ్గకుండా వృద్ధి సాధించాలి. ఆ లక్ష్యంగా సీఎం చంద్రబాబునాయుడు అన్ని శాఖలలో కార్యక్రమాల అమలుకు రాష్ట్ర, జిల్లా విజన్ యాక్షన్‌ప్లాన్‌ను అక్టోబరు 2న ఆవిష్కరించటం జరుగుతుందన్నారు. వీడియో కాన్ఫరెన్స్‌కు కలెక్టరేట్ వీసీ సమావేశ మందిరం నుంచి పాల్గొన్న ముఖ్య ప్రణాళికా అధికారిణి శేషశ్రీ మాట్లాడుతూ విజన్ యాక్షన్‌ప్లాన్ రూపొందించటంపై జిల్లా అధికారులకు వర్క్‌షాపు నిర్వహించటం జరిగిందన్నారు. విజన్ యాక్షన్‌ప్లాన్‌ను పర్యవేక్షించటానికి ప్రత్యేక కంట్రోల్ రూంను కలెక్టర్ ఎస్ నాగలక్ష్మి సూచనలతో ఏర్పాటు చేయటం జరుగుతుందని వివరించారు. వీడియో కాన్ఫరెన్స్ ప్రారంభానికి ముందు జిల్లా విజన్ యాక్షన్ ప్లాన్ రూపొందించటంపై ఇటీవల రాష్ట్ర స్థాయిలో శిక్షణ పొందిన సీపీవో శేషశ్రి, జిల్లా ఉద్యాన శాఖ అధికారి రవీందర్, జిల్లా స్కిల్ డెవలప్‌మెంట్ అధికారి ప్రణయ్ జిల్లా అధికారులకు విజన్ యాక్షన్ సర్వీస్ సెంటరు, సబ్ సెక్టార్ ప్లాన్ రూపొందించ టానికి నిర్దేశించిన లక్ష్యాలు, అంశాలను పవర్ పాయింట్ ద్వారా వివరించారు. ఈ సమావేశంలో డీఎఫ్ఓ మహబూబ్ బాషా, జిల్లా పంచాయితీ రాజ్ ఇంజనీరింగ్ ఎస్ఈ బ్రహ్మయ్య, బీసీ కార్పోరేషన్ ఈడీ దుర్గాబాయి, ఆర్‌డబ్ల్యుఎస్ ఎస్ఈ సురేష్, ఆర్ అండ్ బీ ఈఈ సమర్పణరావు, డ్వామా పీడీ ఉమాదేవి, డీఆర్డీఏ పీడీ హరిహరనాథ్, మైనింగ్ ఏడీ చంద్రశేఖర్, జిల్లా మత్స్య శాఖ అధికారి గాలి దేముడు, జిల్లా పరిషత్ డీప్యూటీ సీఈవో మోహనరావు, డీఎంహెచ్‌వో డాక్టర్ విజయలక్ష్మి, సమగ్రశిక్ష ఏసీపీ విజయలక్ష్మి, డీఈవో శైలజ, జిల్లా మహిళాభివృద్ధి, శిశు సంక్షేమ శాఖ పీడీ ఉమాదేవి, జిల్లా చేనేత, జౌళి శాఖ ఏడీ వనజ, జిల్లా పౌర సరఫరాల అధికారి కోమలి పద్మ, జిల్లా సివిల్ సప్లయిస్ కార్పొరేషన్ డీఎం శ్రీలక్ష్మి, జిల్లా వ్యవసాయశాఖ అధికారి నున్న వెంకటేశ్వర్లు, జిల్లా గిరిజన సంక్షేమ శాఖ అధికారి శిరీష తదితరులు పాల్గొన్నారు.



బోనస్ అందజేస్తున్న అధ్యక్షుడు సుబ్బారావు

గుడివాడ పాల సొసైటీలో బోనస్ పంపిణీ

తెనాలి అర్బన్, ఆగస్టు 17 : రూరల్ మండలం గుడివాడ పాలసొసైటీలో శనివారం పాల ఉత్పత్తిదారులకు రూ.లక్షా 76 వేల 807లు బోనస్ పంపిణీ చేశారు. 111 పాల ఉత్పత్తిదారులు ఏడాది పాటు పాలు సరఫరా చేసినందుకు గాను సొసైటీ అధ్యక్షుడు బొద్దులూరి సుబ్బారావు బోనస్ అందజేశారు. పాల ఉత్పత్తిదారులకు సంగం డెయిరీ ఆధ్వర్యంలో పలు సేవలు అందిస్తున్నామన్నారు. కో-ఆర్డినేటర్ ఉప్పల సందీప్‌కృష్ణ, సూపర్‌వైజర్ పాల్గొన్నారు.

ఎన్నికల వ్యవస్థపై విద్యార్థులకు అవగాహన

తెనాలి అర్బన్, ఆగస్టు 17 : ప్రజాస్వామ్యంలో ఎన్నికల వ్యవస్థపై విద్యార్థులకు అవగాహన ఉండాలని ఎంఈవో లక్ష్మీనారాయణ అన్నారు. చెంచుపేట నారాయణ స్కూల్లో శనివారం విద్యార్థి నాయకుల ఎన్నిక నిర్వహించి బాధ్యతల స్వీకార కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఎంఈవో మాట్లాడుతూ క్లాస్, స్కూల్ లీడర్ల ఎన్నిక, బాధ్యతలు వివరించారు. నేటి పోటీ ప్రపంచంలో విద్యార్థులు రాణించేందుకు బృంద నాయకత్వం ఒక నైపుణ్యమన్నారు. దానిని స్కూల్ స్థాయిలోనే అర్థం చేసుకోవాలన్నారు. ఏజీఎం వెంకటేశ్వరరావు, పూర్ణిమ, శ్రీనివాసరావు, నాగలక్ష్మి, దేవిరాణి పాల్గొన్నారు.